ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
గురువారం 4 డిసెంబరు 2025

బాలింతలకు అమ్మఒడి వాహనాలు

జగిత్యాల అర్బన్, డిసెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాలోని గర్భిణులకు, బాలింతలకు అమ్మఒడి 102 వాహనాలు వరంగా మారాయని 102 జిల్లా మేనేజర్ ఆశోద ఐలయ్య అన్నారు. బుధవారం 102 వాహనాల సిబ్బందికి నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జిల్లా 102 వాహనాలు ఆరు ఉన్నాయని, మహిళలు గర్భం దాల్చినప్పటినుంచి ప్రసవం అయ్యే వరకు ప్రతి నెల వారి ఇంటి దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్ళడం వైద్య పరీక్షలు చేయించి గమ్య స్థానాలకు చేర్చడం జరుగుతున్నదన్నారు. ప్రసవం అనంతరం తల్లి బిడ్డలను క్షేమంగా ఇంటికి చేర్చుతున్నామన్నారు. మారుమూల ప్రాంతాల్లో వారికి 102 వాహనాలు ఎంతో ప్రయోజనకారిగా ఉన్నాయన్నారు.

ఉద్యానవన పంటల పరిశీలన

ధర్మపురి, డిశంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని దోనూరు, తుమ్మెనాలలో ఉద్యానవన పంటలను జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమ అధికారి శ్యామ్‌ప్రసాద్ పరిశీలించారు. దోనూరులో రెండు ఎకరాలలో డ్రాగన్ ఫ్రూట్ సాగు పరిశీలించి పలు సూచనలు చేశారు. తుమ్మెనాలలో రైతు బంద గంగారాం సాగు చేసిన పందిరి సాగు పద్ధతిలో కూరగాయలు పండిస్తున్న బీర తోటను సందర్శించారు. మల్చింగ్ పద్ధతి ఉపయోగం, సేంద్రియ పదర్థాల ఎక్కువ వినియోగం గురించి అక్కడి రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల ఉద్యానవన అధికారి అర్చన, విస్తరణ అధికారి వంశీకృష్ణ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల తొలగింపు

కోరుట్ల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని అయిలాపూర్ రోడ్డులో అక్రమంగా నిర్మిస్తున్న కట్టడాలను మున్సిపల్ అధికారులు బ్లేడ్ ట్రాక్టర్ సహాయంతో తొలగించారు. అయిలాపూర్ రోడ్డులో ఉన్న మద్దుల చెరువు నాలను మూసి వేసి అక్రమ నిర్మాణం చేస్తున్న బేస్మెంట్‌ను తొలగించారు. బఫర్ జోన్‌లో నిర్మాణం చేస్తున్న వారికి నోటీసులను జారీ చేసి తొలగించారు.



- పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పోలీసు శాఖ అప్రమత్తం
- 733 పోలింగ్ స్టేషన్లలో 332 సమస్యాత్మకంగా గుర్తింపు
- జిల్లాలో 197 కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్
- జిల్లా వ్యాప్తంగా 89 మంది మైక్రో అబ్జర్వర్ల నియామకం
- అనుమానితుల బైండోవర్

పటిష్ట నిఘా

కొండగట్టు సమీపంలో దొంగలమర్రి చెక్ పోస్టును తనిఖీ చేస్తున్న ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా పోలీసు యంత్రాంగం గ్రామాల్లో పటిష్ఠ నిఘా ఏర్పాటు చేసింది. జిల్లాలో 385 పంచాయతీలు ఉండగా 3,536 వార్డులున్నాయి. జిల్లా వ్యాప్తంగా 477 లోకేషన్లలో 3,536 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. ఇందులో 733 పోలింగ్ స్టేషన్లు సాధారణం కాగా, 733 పోలింగ్ స్టేషన్లు సున్నితమైనవిగా, ఒక పోలింగ్ స్టేషన్ అతి సున్నిత మైనదిగా, 332 పోలింగ్ స్టేషన్లు సమస్యాత్మక మైనవిగా గుర్తించారు. జిల్లా వ్యాప్తంగా 197 వెబ్ కాస్టింగ్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. క్షేత్ర స్థాయిలో పరిస్థితిని ఎప్పటికప్పుడు ఎన్నికల సంఘా నికి అందజేయడానికి 89 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించారు. వీరికి అవసరమైన శిక్షణను కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్‌లు నిర్వహించి సంపూర్ణ అవగాహన కల్పించారు. గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు బలగాలు, రిజర్వ్ ఫోర్సు బలగాలు, నిఘా టీంలు నిత్యం పర్యవేక్షణ చేస్తున్నాయి.

అభ్యర్థుల ఖర్చుపై ...

ఎన్నికల ప్రచారంలో అభ్యర్థుల వారీగా ఖర్చు చేస్తుంటారు. వాహనాల ర్యాలీలు నిర్వహిస్తుంటారు. గ్రామాల పర్యటనకు వాహనాల వినియోగం, బ్యానర్లు, పోస్టర్లు, ఫ్లెక్సీలు సమకూర్చుకుంటారు. వీటితో పాటు వెంట తిరిగే కార్యకర్తలకు అల్పాహారం, మధ్యాహ్న భోజనం, మద్యం, మాంసాహారాలను సమకూర్చుతుంటారు. లెక్కకు మించి ఖర్చు చేసే వారిపై గట్టి నిఘాను ఏర్పాటు చేసింది. ఎంసీసీ మానిటరింగ్ నోడల్ ఆఫీసర్‌గా జిల్లా ఆడిట్ అధికారి సుజాతను, పరిశీలక విభాగం నోడల్ ఆఫీసర్‌గా జిల్లా మెప్మా అధికారి దుర్గపు శ్రీనివాస్ గౌడ్‌ను, బ్యాలెట్ పేపర్ల నిర్వహణకు నోడల్ అధికారిగా జిల్లా సహకారశాఖ అధికారి మనోజ్ కుమార్‌ను నియమించారు. వీరంతా సమీకృత కలెక్టరేట్ కేంద్రంగా ఆయాపనులను పర్యవేక్షిస్తుంటారు.

నగదు తరలింపుపై నజర్...

ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో నగదు తరలింపుపై దృష్టి సారించింది. సర్పంచ్, వార్డు స్థానాలకు పోటీ చేయాలని భావించే ఆశావహులు, వారి బంధు మిత్రులపై నిఘా ఉంచింది. ఓటర్లను ప్రలోభాలకు గురి చేసే అవకాశం ఉన్నందున వారి రాక పోకలు సహా బ్యాంక్ అకౌంట్లపైనా దృష్టి పెట్టింది. తనిఖీల్లో రూ. 50 వేలకు మించి నగదు దొరికితే పోలీసులు స్వాధీనం చేసుకోనున్నారు. జిల్లా, మండల, గ్రామ సరిహద్దులు, ప్రధాన రహదారులపై పోలీస్ పికెట్లను ఏర్పాటు చేశారు. ఇప్పటికే తనిఖీ విభాగాలకు మండల తహసీల్దార్లను నోడల్ అధికారులుగా నియమించింది. సరైన ఆధారాలు (వస్తు కొనుగోలు-అమ్మకాలకు సంబంధించిన రసీదులు) చూపిస్తేసరి, లేదంటే ఆయా నగదును స్వాధీనం చేసుకోనుంది. పెద్ద మొత్తంలో మద్యం కొనుగోళ్లు, సరఫరా, బంగారం, వెండి వస్తువులు, చీరలు,

మిగతా 8వ పేజీలో

ఎన్నికల నియమావళిని పాటించాలి

సత్యప్రసాద్, కలెక్టర్



ఎన్నికల ప్రవర్తన నియమావళిని అన్ని వర్గాలు పాటించాలి. జిల్లాలో ప్రశాంతంగా, పారదర్శకంగా స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించడానికి జాగ్రత్తలు తీసుకుంటున్నాము. నగదు తరలింపుపై నిఘా ఉంచాము. నిబంధనల ప్రకారం నగదు తరలింపు జరగకుంటే చర్యలు తప్పవు.

పకడ్బందీగా తనిఖీలు: అశోక్ కుమార్, ఎస్పీ



జిల్లా సరిహద్దు ప్రాంతాలలో చెక్ పోస్టులను ఏర్పాటు చేసి పకడ్బందీగా తనిఖీలు నిర్వహిస్తు న్నాము. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆయా సందర్భాల్లో పోలీసులు సోదాలు చేస్తున్నారు. అక్రమంగా నగదు తరలింపుపై నిఘా ఉంచాము. నిబంధనలకు విరుద్ధంగా నగదు తరలింపులు జరపవద్దు.

ఆఖరి విడతలో తొలి రోజు 451 నామినేషన్లు

జగిత్యాల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తుది విడతలో బుధవారం 119 సర్పంచ్ స్థానాలకు 152 నామినేషన్లు వచ్చాయి. 1,088 వార్డు స్థానాలకు గాను 299 నామినేషన్లు దాఖలయ్యాయి.

మండలం	సర్పంచ్‌లు	నామినేషన్లు	వార్డులు	నామినేషన్లు
ధర్మపురి	25	31	224	52
బుగ్గారం	10	17	96	32
ఎండపల్లి	15	15	138	43
వెల్గటూర్	19	15	168	31
గొల్లపల్లి	27	35	246	69
పెగడపల్లి	23	39	216	72
మొత్తం	119	152	1,088	299

ఎన్నికల ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి



సిబ్బందితో మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకుడు రమేష్

జగిత్యాల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలు ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని జిల్లా పంచాయతీ ఎన్నికల పరిశీలకులు జి.రమేష్ అన్నారు. బుధవారం మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఖచ్చితంగా అమలు చేయాలని సూచించారు. అలాగే ఎంసిసి కంట్రోల్ రూం సభ్యులు 24 గంటల పాటు కంట్రోల్ రూం ద్వారా అందిన ఫిర్యాదులపై వెంటనే చర్యలు తీసుకుంటున్నామని, అవసరమైన చరప్యల కోసం అప్రమత్త చేస్తున్నామన్నారు. ఆయన వెంట డీఆర్డీఓ రఘువరణ్, నోడల్ అధికారి నరేష్ ఉన్నారు.

ఎన్నికల నియామావళి ఉల్లంఘిస్తే చర్యలు

-ఎస్పీ అశోక్ కుమార్



మాట్లాడుతున్న ఎస్పీ అశోక్‌కుమార్

జగిత్యాల టౌన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఎన్నికల నియామావళి ఉల్లంఘనలపై కఠినంగా వ్యవహరించాలని ఎస్పీ అశోక్ కుమార్ పోలీస్ అధికారులకు సూచించారు. సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో పోలీస్ అధికారులు, సిబ్బంది నిర్వహించాల్సిన విధి విధానాలపై జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం పోలీస్ అధికారులతో ఎస్పీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో మూడు విడుతలలో జరిగే గ్రామపంచాయతీ ఎన్నికలకు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

అక్రమ మద్యం, నగదు, ఉచితాల పంపిణీపై నిఘా ఉంచుతూ తనిఖీలు నిర్వహించాలని సూచించారు. సోషల్ మీడియాపై మరింత నిఘాపెంచాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపె ఎస్పీ శేషాద్రిని రెడ్డి, డీఎస్పీలు వెంకటరమణ, రఘుచందర్, రాములు, సీఐలు, పలువురు ఎస్ఐలు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు చేయూతనివ్వాలి


-జిల్లా విద్యాధికారి రాము



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న డీఈవో రాము

జగిత్యాల అగ్రికల్చర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగ విద్యార్థులకు చేయూతనందించాలని జిల్లా విద్యాధికారి రాము అన్నారు. పట్టణంలోని స్థానిక భవిత కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ దివ్యాంగులను దైవప్రసాదంగా భావించాలే తప్ప, భారంగా భావించవద్దన్నారు. దివ్యాంగులను ప్రోత్సహించి, మానసిక ఎదుగుదలకు తోడ్పడాలని సూచించారు. అనంతరం పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఆనందరావు మాట్లాడుతూ దివ్యాంగులను అన్నిరంగాల్లో ప్రోత్సహించి, సమాజ అభివృద్ధిలో వారిని భాగస్వాములను చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా దివ్యాంగ విద్యార్థులకు నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు డీఈవో చేతులమీదుగా బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఐఆర్‌ఈపీలు రాజేందర్, రాజబాబు తో పాటు విద్యార్థులు, పోషకులు పాల్గొన్నారు.

తొలి విడత పంచాయతీ సర్పంచ్ బరిలో 462 మంది



జగిత్యాల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తొలివిడతలో 122 గ్రామ పంచాయతీ ఎన్నికలకు సర్పంచ్ స్థానాలకు 462మంది బరిలో ఉన్నారు. 1,172 వార్డు మెంబర్ స్థానాలకు 1,954 మంది బరిలో నిలిచారు. నాలుగు సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవం కాగా, 348 వార్డు స్థానాలు ఏకగ్రీవమయ్యాయి.

మండలం	నామినేషన్లు ఉపసంహరణలు		ఏకగ్రీవమైన స్థానాలు		బరిలో ఉన్న అభ్యర్థులు	
	సర్పంచ్	వార్డు సభ్యులు	సర్పంచ్	వార్డు సభ్యులు	సర్పంచ్	వార్డు సభ్యులు
భీమారం	16	18	-	32	48	221
ఇబ్రహీంపట్నం	16	20	2	62	52	223
కథలాపూర్	13	54	1	31	83	387
కోరుట్ల	18	34	0	32	57	293
మల్లాపూర్	45	37	0	52	82	362
మేడిపల్లి	14	10	0	38	46	215
మెట్‌పల్లి	35	39	1	101	94	253
మొత్తం	157	212	4	348	462	1,954

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్

జగిత్యాలరూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని జగిత్యాల జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్ అన్నారు. సారంగాపూర్ మండల కేంద్రాల్లోని పలు ఎరువుల దుకణాలను ఆయన బుధవారం పరిశీలించారు. ఎరువులస్టాక్ రిజిష్టర్, బిల్లు పుస్తకాలను పరిశీలించారు. దుకాణాల్లో నిల్వల రిజిష్టర్లను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధార్ కార్డు ఆధారంగా ఎరువులను విక్రయించాలని సూచించారు. డీలర్లు ఎరువులు, పురుగుల మందుల విత్తనాల స్టాక్ బోర్డుల ను రైతులకు కనబడేవిధంగా ప్రదర్శించాలని సూచించారు. ఆయన వెంట ఏడీఏ తిరుపతినాయక్, వ్యవసాయాధికారి ప్రదీప్‌రెడ్డి పాల్గొన్నారు.

హిందూ దేవుళ్లపై సీఎం వ్యాఖ్యలు అహంకారానికి నిదర్శనం

-బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాదగిరి బాబు



నల్ల బ్యాడ్జీలతో ర్యాలీగా వస్తున్న బీజేపీ నాయకులు

జగిత్యాల అగ్రికల్చర్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): హిందూ దేవతలపై తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఆయన అహంకారానికి నిదర్శనం అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాదగిరి బాబు అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి హిందూ దేవుళ్లపై చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ బీజేపీ రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని స్థానిక తహశీల్ చౌరస్తా వద్ద బీజేపీ నేతలు నల్లబ్యాడ్జీలు ధరించి, రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించి తమ నిరసనను తెలియజేశారు. ధర్నా చేస్తున్న బీజేపీ నేతలను పట్టణ సీఐ కరుణాకర్ ఆధ్వర్యంలో పోలీసులు నాయకులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బీజేపీ నేతలు మాట్లాడుతూ హిందూ దేవుళ్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి అన్యమత దేవుళ్లపై మాట్లాడగలడా అని ప్రశ్నించారు. గతంలో మాజీ సీఎం కేసీఆర్ హిందువులపై అనుచిత వ్యాఖ్యలు చేసి మూల్యం చెల్లించుకున్నారని, త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలతో కాంగ్రెస్ పార్టీ సైతం మూల్యం చెల్లించుకోకతప్పదన్నారు. ప్రతిపక్షంలో ఉన్నపుడు తానే గొప్ప హిందువునని ప్రకటించుకున్న రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చి, సీఎం అయిన తదనంతరం హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేయడం ఆయన స్థాయికి తగదన్నారు. హిందువుల ఓట్లతో గెలిచి, హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా మాట్లాడిన సీఎం రేవంత్‌రెడ్డి హిందూ సమాజానికి భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ బాధ్యులు నలువాల తిరుపతి, సాంబారి కళావతి, దశరథరెడ్డి, కొక్కు గంగాధర్, ఆముదరాజు, పవన్‌సింగ్, సదాశివ్, దొనికెల నవీన్‌కుమార్, సాగర్, జున్ను రాజేందర్ ఉన్నారు.

పవన్ కల్యాణ్ క్షమాపణ చెప్పాలి

●ఎస్సీ, ఎస్టీ, వికలాంగుల సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



మాట్లాడుతున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

మల్యాల, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తక్షణమే తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ డిమాండ్ చేశారు. కోనసీమ కొబ్బరిచెట్లకు నష్టం జరిగితే తెలంగాణ ప్రజల కన్నుపడడంతోనే అలా జరిగిందని పవన్ వ్యాఖ్యనించడం ఇక్కడి ప్రజల మనోభావాల్ని దెబ్బతీసే విధంగా ఉన్నాయన్నారు. బుధవారం జగిత్యాల జిల్లా కొండగట్టు అంజనేయస్వామిని దర్శించుకున్న అనంతరం మంత్రి అడ్లూరి విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పవన్ కల్యాణ్ సినిమాలను ఆదరిస్తారని, ఆయనకు భారీ సంఖ్యలో అభిమానులు ఉన్నారన్నారు. బాధ్యత గల ఉప ముఖ్యమంత్రి హోదాలో ఉన్న పవన్ కల్యాణ్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదని పేర్కొన్నారు. కొండగట్టు అంజనేయస్వామి భక్తుడిగా పవన్ కల్యాణ్ బుద్ధి మారి క్షమాపణ కోరడం మంచి పద్ధతి అని అన్నారు. పవన్‌కు కనువిప్పు కలిగించాలని కొండగట్టు అంజన్నకు పూజలు నిర్వహించినట్లు మంత్రి తెలిపారు. పవన్ కల్యాణ్ క్షమాపణ చెప్పకపోతే రాబోయే రోజుల్లో ఆయన సినిమాలకు తెలంగాణలో తీవ్ర ఇబ్బందికర పరిస్థితులు తప్పవని మంత్రి అడ్లూరి అన్నారు.

● అగ్నిప్రమాద బాధితులను ఆదుకుంటాం

దిగువ కొండగట్టులో శనివారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో నష్టపోయిన బాధితులు ఆందోళన చెందవద్దని మంత్రి అడ్లూరి లక్ష్మన్‌కుమార్ అన్నారు. స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డిని కలవడం జరిగిందని బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరడం జరిగిందని, త్వరలో హైదరాబాద్‌లో జరిగే గ్లోబల్ సమ్మిట్ తరువాత మరో సారి కలిసి బాధితులకు న్యాయం చేస్తామని తెలిపారు.

'అభివృద్ధి కోసం అందరితో కలిసి పని చేస్తా'

జగిత్యాల అర్బన్, డిసెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల నియోజక వర్గం అభివృద్ధి కోసం అందరితో కలిసి పనిచేస్తానని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. బుధవారం జగిత్యాల పట్టణంలోని 12, 28, 29, 30 వార్డులలో 53 లక్షలతో చేపట్టనున్న సిసి రోడ్డు, డ్రైనేజీ నిర్మాణాకిఇ ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో మౌళిక సదుపాయాల కల్పనకు అను నిత్యం కృషి చేస్తున్నానని, రోడ్డు ప్రమాదాల అధికంగా జరిగే మంచి నీళ్ళ బావి నుంచి చ ల్‌గల్ వరకు బ్లాక్ స్పాట్ రోడ్డుకు కృషి చేయడం జరిగింది. చింత కుంట బతుకమ్మ ఘాట్, పార్క్ అభివృద్ధి చేయటం జరిగిందని, చింతకుంట స్మశాన వాటికను అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. నియోజక వర్గంలో పార్టీలకతీతంగా అభివృద్ధి చేస్తున్నానని ఎస్‌కెఎన్ఆర్ కళాశాల, ధర్మసముద్రంలో కొత్త నీటి ట్యాంక్‌లు నిర్మాణం చేపట్టామన్నారు. అర్బన్ కాలనీ ప్రజల కోసం సరస్వతి గుట్టపై అతి పెద్ద నీటి ట్యాంక్ నిర్మాణం చేశామని అన్నారు. త్రాగు నీటి సరఫరాలో ఏ మాత్రం ఇబ్బంది ఉన్న సహించేది లేదని 37 మంది వాటర్‌మెన్‌లతో నిరంతరం నీటి సరఫరాను పరిశీలిస్తున్నామన్నారు. ఈ కర్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ స్పందన, మాజీ మున్సిపల్ చైర్మన్‌లు అడువాల జ్యోతి, గిరి నాగభూషణం మాజీ కౌన్సిలర్‌లు బాలె లత, మేకల పద్మవతి, పంబాల రాము, నాయకులు అడువాల లక్ష్మణ్, బాలె శంకర్, దూమాల రాజ్ కుమార్, బద్దం జగన్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

●జగిత్యాల నియోజక వర్గానికి 37 వందల ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసేందుకు ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. జగిత్యాల పట్టణంలోని లబ్దిదారులకు ఇందిరమ్మ ఇల్ల ప్రొసిడింగ్‌లను ఎమ్మెల్యే బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతర నియోజక వర్గాలతో పోల్చితే జగిత్యాల నియోజక వర్గానికి 12 వందల ఇందిరమ్మ ఇండ్లను ముఖ్యమంత్రి మంజూరుకు హామీ ఇచ్చారన్నారు. పేదవారి సొంతింటి కళ నిజం చేయడానికే రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ళ మంజూరు కా ర్యక్రమం చేపట్టిందన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో అభివృద్ధి సంక్షేమం సమానంగా జరుగుతున్నాయన్నారు.

నామినేషన్ల స్వీకరణను పకడ్బందీగా నిర్వహించాలి

పెగడపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : నామినేషన్ల స్వీకరణ పకడ్బంధీగా స్వీకరించాలని జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ మూడవ విడుత ఎన్నికలకు సంబంధించి పెగడపల్లి మండలంలోని 23 గ్రామాలలో బుదవారం నుండి నామినేషన్ల స్వీకరణ ప్రారంబం కాగా జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ నంచర్ల గ్రామపంచాయతీలో నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు.

ఈ సందర్భంగా నామినేషన్ల స్వీకరణ తీరును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అభ్యర్థులకు ఏమైనా సందేహాలుంటే హెల్ప్ డెస్క్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ప్రేమ్‌సాగర్ రావు, తహసీల్దార్ ఆనంద్ కుమార్, ఎంపీవో శశికుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

●గొల్లపల్లి: సర్పంచ్, వార్డు స్థానాలకు నామినేషన్ల స్వీకారణ ప్రక్రియను పగడ్బంధీగా నిర్వహించాలని కలెక్టర్ సత్య ప్రసాద్ అధికారులను ఆదేశించారు. బుధవారం మూడవ విడత గ్రామ పంచాయతీ పాలక వర్గాలకు జరుగుతున్న ఎన్నికల ప్రక్రియలో భాగంగా ప్రారంభమైన నామినేషన్ల స్వీకారణ ప్రక్రియలను కలెక్టర్ మండలంలోని చిల్వాకోడూర్, తిర్మలాపూర్ (పీడీ) కేంద్రాల్లో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా చేపట్టాలన్నారు. ఆఖరి రోజు ఎక్కువ మంది నామినేషన్లు దాఖలు పరిచే అవకాశం ఉన్నదృష్ట్యా ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ సత్యప్రసాద్ వెంట ట్రైనీ డిప్యూటి కలెక్టర్ హరిణి, తహసీల్దార్ మాజీద్, ఎంపీడీవో రవీందర్ రావు ఉన్నారు.



నామినేషన్లను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

ఆంధ్రజ్యోతి CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, MOHMMED KHAJA SIRAJUDDIN, S/O. MOHMMED KHAJA MOHINUDDIN, R/O. H.NO. 19-1-54/2, ASHOK NAGAR, GODAVARIKHANI, RAMAGUNDAM MANDAL, PEDDAPALLI DISTRICT, T.S. 505209. I HAVE CHANGED MY NAME AS KHAJA SIRAJUDDIN, S/O. MOHMMED KHAJA MOHINUDDIN FOR ALL PURPOSE
AJK-807

డాక్యుమెంట్ పోయినది.

★ నేను సీలగిరి చొక్కరావు, తండ్రి : నారాయణరావు, ఇ.నెం. 1-1-121, భీమునిదుబ్బా, టౌన్ & మండలం కోరుట్ల, జిల్లా : జగిత్యాల. నా ఒరిజినల్ డాక్యుమెంట్ నం. 734/1985ను మా ఇంటి నుండి రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లుతున్న సమయంలో పోయినది. ఎవరికైనా దొరికినట్లయితే దయచేసి సంప్రదించండి. సెల్ : 72859 95725
AJK-17507

3+2 స్కీం కలదు

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడీవీటీ

ఆంధ్రజ్యోతి ప్రకటనలకై సంప్ర : 99854 11174

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనలకై సంప్రదించండి
కరీంనగర్ :- సెల్ : 9703618691, 99854 10640
జగిత్యాల, మెట్‌పల్లి :- సెల్ : 99854 11262
వేములవాడ, సిరిసిల్ల :- సెల్: 99854 11063

ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొని ఒకరి మృతి

● మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

ధర్మారం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న ట్రాక్టను ఢీకొని ఒకరు మృతి చెందగా ఇద్దరు తీవ్ర గాయాలపాలైన ఘటన ధర్మారం మండలం పత్తిపాక గ్రామంలో చోటుచేసుకుంది. పత్తిపాకకు చెందిన నవనందుల రాజేష్, అరవెండి కిష్టయ్య, మంగారపు సాయికుమార్ అనే ముగ్గురు వ్యక్తులు బుధవారం బైక్‌పై గంగ స్నానానికి గోదావరికి వెళ్లారు. తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో పత్తిపాక గ్రామ డాంబర్ ప్లాంట్ సమీపంలో ఆగిఉన్న ట్రాక్టర్ ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో బండి నడుపుతున్న నవనందుల రాజేష్(36) అక్కడిక్కడే మృతిచెందగా కిష్టయ్య, సాయికుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108సిబ్బంది గాయపడిన వారిని చికిత్స నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని ఎస్ఐ ప్రవీణ్ సందర్శించి వివరాలు సేకరించారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

కరీంనగర్ క్రైం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కరీంనగర్‌లోని సంతోష్‌నగర్‌కు చెందిన బోయినిపల్లి వెంకటరమణారావు(56) బుధవారం మధ్యాహ్నం మృతి చెందినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. గతనెల 30న వెంకటరమణారావు బైక్‌పై వెళ్తుండగా కుక్క అడ్డురావడంతో కిందపడ్డాడని, తలకు తీవ్రగాయాలవడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారని పేర్కొన్నారు. వెంకటరమణారావు భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గాయపడిన వ్యక్తి మృతి

ధర్మపురి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని తీవ్ర గాయాలపాలైనవ్యక్తి మృతిచెందిన సంఘటన ధర్మపురి మండలంలో చోటుచేసుకుంది. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం రెబ్బనపల్లి గ్రామానికి చెందిన కునసపల్లి మురళి(48) ఈ నెల 1న సుతారీ మీటింగ్ నిమిత్తం రెబ్బనపల్లి గ్రామానికి వెళ్లి తిరిగి వస్తుండగా ధర్మపురి మండలంలోని తిమ్మాపూర్ గ్రామ సమీపంలో పొలాల నుంచి వస్తున్న ఒక వ్యక్తి తన ద్విచక్ర వాహనంతో మురళి ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్నాడు. వెంటనే మురళిని హుటాహుటిన 108లో జగిత్యాల ఆస్పత్రికి తరలించగా, అక్కడి నుంచి కరీంనగర్ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మురళి భార్య గంగ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జి.మహేష్ తెలిపారు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య

ఓదెల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాంసానిపల్లికి చెందిన కందుల రాజు(35) అనేవ్యక్తి పురుగులమందు తాగి బుధవారం మృతిచెందాడు. మతిస్థిమితం సక్రమంగా లేక మంగళవారం ఇంటి వద్ద పురుగుల మందు తాగగా కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ మృతిచెందాడు. మృతుడి తండ్రి మొండయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పొత్కపల్లి ఎస్ఐ రమేష్ తెలిపారు.

ఘనంగా శ్రీకాంతాచారి వర్ధంతి



హుజూరాబాద్‌లో శ్రీకాంతాచారి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

హుజూరాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తా వద్ద విశ్వకర్మ మన్మయసంఘం ఆధ్వర్యంలో శ్రీకాంతాచారి వర్ధంతిని బుధవారం ఈ సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, భిక్షపతి, రఘు, సత్యానారాయణ, శ్రీనివాస్, వీరాచారి, సదానందం, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తిపై కేసు



డ్రైవర్‌కు డ్రంకెన్‌డ్రైవ్ టెస్టు చేస్తున్న ఎస్సై శ్రీకాంత్

తిమ్మాపూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాజీవ్‌రహదారిపై బుధవారం రాత్రి ఓ లారీడ్రైవర్ అతివేగంగా అజాగ్రత్తగా లారీని నడుపుకుంటూ వెళ్తుండగా ఎల్ఎండీ పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేసి లారీని సీజ్ చేశారు. ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. ఓ లారీ అతివేగంగా అజాగ్రత్తగా నడుపుకుంటూ రాజీవ్ రహదారిపై వెలుతుండగా గమనించిన బ్లూకోల్ట్ సిబ్బంది లారీని వెంబడించారు. సుభాష్‌నగర్ వద్ద లారీని పట్టుకున్నారు. లారీ డ్రైవర్‌కు డ్రంకెన్‌డ్రైవ్ టెస్ట్ చేయగా అతిగా మద్యం సేవించినట్లు వచ్చింది. అతివేగంతో పాటు అతిగా మద్యం సేవించి లారీ నడుపుతున్న లారీ డ్రైవర్ మెదక్ జిల్లా నర్సింగ్ గ్రామానికి చెందిన కబూజి వేణును అదుపులోని తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. లారీని సీజ్ చేసి ఎల్ఎండీ పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని ఎస్సై శ్రీకాంత్ హెచ్చరించారు

బీసీలపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం



నిరసన వ్యక్తం చేస్తున్న బీసీ జేఏసీ నాయకులు

హుజూరాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నల్గొండ జిల్లాలో బీసీ సామాజిక బిడ్డపై అగ్రవర్ణాల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని బీసీ జేఏసీ, ప్రజాస్వామిక బీసీ ఉద్యమవేదిక నాయకులు అన్నారు. బుధవారం వారు వేర్వేరుగా హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర వచ్చి 78ఏళ్లు గడుస్తున్న అగ్రవర్ణాల ఆగడాలు రోజురోజుకు శృతి మించి పోతున్నాయన్నారు. నల్గొండ జిల్లాలోని యాదవ సామాజిక వర్గానికి చెందిన నాగలక్ష్మి తమ స్వగ్రామంలో సర్పంచ్ పదవికి నామినేషన్ వేయగా, ఆమెభర్త యాదగిరిని కిడ్నాప్‌చేసి మూత్రం తాగించిన సందీప్‌రెడ్డిని చట్టపరంగా కఠినంగా శిక్షించాలన్నారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమంలో వెంకన్న, శ్రీనివాస్, ప్రభాకర్, సమ్మయ్య, కేశవులు, ఓదెలు, రామ్, సారన్న, మధుకర్, రవీందర్, శ్రీకాంత్, శ్రీనివాస్, సురేష్, క్రాంతి, రవీందర్, సదానందం, ప్రభాకర్, ముత్యంరాజు, ఖలీద్ హుస్సేన్, రాజేశ్వరరావు, చారి, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

● పీఎం సమృద్ధి యోజన ద్వారా భరోసా
● వేములవాడలో 3,260 మందికి రుణాలు

చిరు వ్యాపారులకు కేంద్రం కానుక



వేములవాడ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణాల్లో రోడ్లపక్కన తోపుడు బండ్లు, షెడ్లు వేసుకుని బతుకు బండితో జీవనం సాగిస్తున్న వీధి వ్యాపారు లకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రధానమంత్రి సమృద్ధి యోజన పథకం కానుకగా మారింది. తోపుడు బండ్లపై ఆధారపడి కాలం గడుపుతున్న వ్యాపారులను మున్సిపాలిటీ ఆధ్వర్యంలో గుర్తించి వారికి గుర్తింపు కార్డులు అందజేస్తే విడుతల వారీగా రూ.10వేల నుంచి 50 వేల వరకు బ్యాంకులు రుణ సదుపాయం కల్పించేలా పథకాన్ని రూపకల్పన చేశారు. ఈ పథకంలో వ్యాపారం చేసుకోవడానికి ఎలాంటి పర్మినెంట్ భవన సముదాయం లేని, కొట్టు లేని, షటర్స్ లేని, రెంట్ భవనం లేని వారు, వీధుల్లో పండ్లు, కూరగాయాలు, తోపుడు బండ్లను వినియోగించి వివిధ రకాల వస్తువులను విక్రయించేవారు, మటన్, చేపలును విక్రయించే వారు అర్హులు. వేములవాడ మున్సిపాలిటీలో కోనాయపల్లి, శాత్రాజుపల్లి, అయ్యోరుపల్లి, నాంపల్లి, తిప్పాపూర్ గ్రామాలు విలీనం కావడంతో 28 వార్డులుగా రూపాంతరం చెందింది. ఆధ్యాత్మిక క్షేత్రంగా బాసిల్లుతున్న పట్టణం కావడంతో పట్టణంలో చిరు, వీధి వ్యాపారులు ఎక్కువ మొత్తంలో జీవిస్తున్నారు. మున్సిపల్ కమిషనర్ అన్వేష్ ఆధ్వర్యంలో ఆర్పీ, సీఎల్ఆర్పీ, టీఎంసీలతో పట్టణ, సెమి అర్బన్ ప్రాంతాలలో చురుకైన వీధి వ్యాపారులు ఉన్న ప్రాంతాలను ముందుగా గ్రీన్, అంబర్, రెడ్ జోన్లుగా వర్గీకరించారు. గ్రీన్ జోన్ (వ్యాపారానికి అనుకులంగా) 3,133 మందిని, అంబర్ జోన్ (కాలనుగుణంగా వ్యాపారం చేసే వారు) 127 మందిని, రెడ్ జోన్‌లో ఎవరూ లేకపోవడంతో మొత్తంగా 3,260 మంది వ్యాపారులను గుర్తించారు.

● లబ్ధిదారులకు గుర్తింపు కార్డులు

వేములవాడ మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటి వరకు 3,260 మంది లబ్ధిదారులను గుర్తించి వారికి గుర్తింపు కార్డులను అందించారు. అధికారులు సర్వే నిర్వహించి గుర్తించిన అనంతరం వ్యాపారులు ప్రస్తుతం తమ కొట్టు ఫొటో, ఆధార్ కార్డు జిరాక్స్, బ్యాంకు పాస్ పుస్తకం, జిరాక్స్‌లతో మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలి. సంబంధిత ధ్రువపత్రాలను సిబ్బంది ఆన్‌లైన్ నమోదు చేసి ఐడీ కార్డులను వ్యాపారులకు అందిస్తారు. మొదటి విడతలో రూ. 10 వేలు బ్యాంకు మంజూరు చేస్తుంది. సంవత్సరం లోపు లోన్ డబ్బులు చెల్లిస్తే రెండవ విడుత రూ. 20 వేలు, మూడవ విడుత రూ. 50 వేలు బ్యాంకు వారు మంజూరు చేస్తున్నారు. ఇప్పటి వరకు మొదటి విడుతలో 2,453 మంది వ్యాపారులు రూ. 10 వేల రుణం తీసుకోగా, రెండవ విడుతలో 1,689 మంది రూ. 20 వేలు, 367 మంది రూ.50 వేల రుణాన్ని తీసుకుని తమ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు.

ఇది నిరంతర ప్రక్రియ

- అన్వేష్, మున్సిపల్ కమిషనర్, వేములవాడ



చిరు వ్యాపారులకు చేయుత ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి సమృద్ధి యోజన పథకం ప్రవేశపెట్టింది. ఈ పథకం ద్వారా పట్టణంలో వ్యాపారులను గుర్తించి ఐడీ కార్డులను అందజేశాం. బ్యాంకు నిబంధనలకు లోబడి రుణాలు ఎప్పటికప్పుడు చెల్లిస్తే రూ. 50 వేల వరకు లోన్ తీసుకోవచ్చు. ఇది నిరంతర ప్రక్రియ పట్టణంలో అర్హులైన చిరు, వీధి వ్యాపారులు ఉంటే ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

రవాణాశాఖ ఆధ్వర్యంలో..

వాహనాల తనిఖీ



పట్టుకున్న వాహనాలతో ఏఎమ్‌వీఐ

ఇల్లంతకుంట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో రవాణాశాఖ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఏఎమ్‌వీఐ రజనీదేవి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన తనిఖీలలో సరైన ధ్రువపత్రాలు లేని 13వాహనాలను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా ఇన్సూరెన్స్, ట్యాక్స్‌లు చెల్లించాలని సూచించారు. కొంత మంది వ్యవసాయానికి వినియోగించే ట్రాక్టర్లను రవాణాకు వాడుతున్నారని పేర్కొన్నారు. తనిఖీల్లో పట్టుబడితే భారీగా జరిమానాలు పడుతాయని, వాహనాల నంబర్ ప్లేటు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉండాలని, వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో రవాణాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సిలిండర్ల దొంగ అరెస్ట్

● 38 సిలిండర్లు స్వాధీనం



పట్టుబడిన సిలిండర్లతో పోలీసులు

జగిత్యాల టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాకేంద్రంలోని పలు ఇళ్లలో సిలిండర్లు అపహరించుకువెళ్ళిన నిందితుడిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. బుధవారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో మీడియా సమావేశంలో నిందితుడి వివరాలను డీఎస్పీ రఘుచందర్ వెల్లడించారు. జగిత్యాల పట్టణంలోని చిలుకవాడకు చెందిన షేక్‌సమీర్ అనే వ్యక్తి పట్టణంలోని ఓ సిలిండర్ గోదాంలో పనిచేస్తూ ఇళ్లకు గ్యాస్ సిలెండర్లను సప్లై చేస్తుండేవాడు. గోదాంలో పని మానేసిన తర్వాత సిలెండర్ల దొంగతనానికి పాల్పడినట్లు డీఎస్పీ తెలిపారు. గోదాంలో పని చేస్తున్న సమయంలో ఎవరి ఇంటి వద్ద రక్షణ లేకుండా సిలెండర్లు ఉంటాయో గమనించి పట్టణంలోని పలువురి ఇళ్లనుంచి 38సిలిండర్లను అపహరించుకొని వెళ్లాడు. సిలిండర్లు అపహరణకు గురైన పలువురు బాధితులు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా పట్టణ సీఐ కరుణాకర్ ఆధ్వర్యంలో పోలీసులు సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా నిందితుడిని గుర్తించి సిలిండర్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో పట్టణ సీఐ కరుణాకర్, పట్టణ ఎస్ఐలు ఎ.కుమారస్వామి,సిహెచ్ రవికిరణ్, ఎం. సుప్రియ, కానిస్టేబుల్ జీవన్ పాల్గొన్నారు.

యమధర్మరాజు ఆలయంలో ఆయుష్య హోమం



ఆయుష్య హోమం నిర్వహిస్తున్న అర్చకులు

ధర్మపురి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి లక్ష్మీనృసింహ స్వామి అనుబంధ దేవాలయం అయిన యమ ధర్మరాజు ఆలయంలో ఆయుష్యహోమం నిర్వహించారు. యమ ధర్మరాజు వారికి పురుష సూక్తం, శ్రీలక్ష్మీసూక్తం, మన్యసూక్తంతో అభిషేకం, ఆయుష్య హోమం, ప్రత్యేకపూజలు, హారతి మంత్రపుష్పం కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్, జక్కు రవీందర్, ధర్మకర్తల మండలి సభ్యులు, సూపరింటెండెంట్ కిరణ్, అర్చకులు నేరెళ్ల వంశీకృష్ణ, వొద్దిపర్తి కళ్యాణ్ కుమార్, బొజ్జ సంపత్ కుమార్, సంతోష్ కుమార్, సిబ్బందిఅర్చకులు అధిక సంఖ్యలో భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పెళ్లి చేసుకుంటానని..

మోసం చేసిన యువకుడి అరెస్టు

కరీంనగర్ క్రైం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని యువతిని మోసం చేసిన కేసులో నిందితుడు నగునూర్‌కు చెందిన బత్తిని శ్రావణ్‌కుమార్‌ను అరెస్టు చేసి జైలుకు తరలించినట్లు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. సీఐ వివరాల ప్రకారం.. ఆసిఫాబాద్‌కు చెందిన యువతి(19) తన మేనత్తతో ప్రతిమ ఆస్పత్రికి వైద్యం కోసం వచ్చింది. ఆ సందర్భంలో ఆసుపత్రిలో రిసెప్షనిస్టుగా పనిచేస్తున్న కరీంనగర్‌రూరల్ మండలం నగునూరుకు చెందిన బత్తిని శ్రావణ్ కుమార్‌తో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం ప్రేమగా మారింది. వివాహం చేసుకుంటానని యువతిని నమ్మిస్తూ వచ్చాడు. ప్రేమ విషయం యువతి తన తల్లిదండ్రులకు చెప్పడంతో ఆమెను ఇంటి నుంచి పొమ్మన్నారు. అప్పటినుంచి శ్రావణ్‌కుమార్ ఫోన్‌స్విచ్ ఆఫ్ చేసుకోవడం, ఆమెను కలువకపోవడంతో నవంబరు 21న నగునూరులోని శ్రావణ్‌కుమార్ ఇంటికి వెళ్లింది. జరిగిన విషయం శ్రావణ్ తల్లిదండ్రులతో చెప్పింది. వారు ఆ యువతిని దూషించి వెనక్కి పంపించారు. ప్రేమ, పెళ్లి పేరుతో మోసం చేసిన శ్రావణ్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలని బాధిత యువతి కరీంనగర్‌రూరల్ పోలీసులకు, మహిళా పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ విషయం తెలుసుకున్న శ్రావణ్ కుమార్ తన మిత్రులను ఆ యువతి వద్దకు పంపించి తన సోదరి వివాహం అనంతరం రెండేళ్లకు వివాహం చేసుకుంటానని, అప్పటివరకు ఖర్చులు తానే భరిస్తానని బోదాసు దేవేందర్, దావు రవితేజ సమక్షంలో ఒప్పుకొని పేపర్‌పై రాసిచ్చాడు. ఆ మరుసటిరోజు నుంచి శ్రావణ్‌కుమార్ మళ్లీ ఫోన్ స్విచ్‌ఆఫ్ చేసుకొని యువతిని పట్టించుకోవడం లేదు. దీంతో శ్రావణ్‌కుమార్‌పై చట్టరిత్యా చర్యలు తీసుకోవాలని, తనకు న్యాయంచేయాలని రూరల్‌పోలీసులను ఆశ్రయించింది. యువతిని వైద్యపరీక్షల కోసం ప్రభుత్వాస్పత్రికి తరలించామని సీఐ తెలిపారు.

ఎట్టకేలకు మినీ స్టేడియం పనులకు మోక్షం

● గత ప్రభుత్వ హయాంలో అర్ధాంతరంగా నిలిచిన పనులు ● ఇటీవల రూ.5 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం



మినీస్టేడియం గ్రౌండ్‌లో కంకర తేలిన ట్రాక్



నిర్మాణంలో ఉన్న భవన సముదాయాలు

వేములవాడ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వేములవాడ ప్రాంతంలో నిర్మించతలపెట్టిన మినీస్టేడియం పనులు పదకొండేళ్లుగా కొనసాగుతూనే ఉన్నాయి. తిప్పాపూర్ గ్రామ శివారులో 2014 సంవత్సరంలో రూ.2.10కోట్ల నిధులతో మినీస్టేడియం నిర్మాణ పనులు చేపట్టేందుకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రణాళికలు రూపొందించి పనులను ప్రారంభించారు. నిధుల విడుదలలో ప్రభుత్వం అలసత్వం వహించడంతో కాంట్రాక్టర్ చేతులెత్తేశారు.

క్రీడాకారుల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సంబంధిత మంత్రితో మాట్లాడి ఇటీవల రూ.5కోట్ల నిధులు మంజూరు చేయించడంతో పనులు పుంజుకున్నాయి.

ప్రస్తుతం మినీ స్టేడియం పనులను త్వరగా పూర్తి చేసేందుకు సోషల్ వెల్ఫేర్‌శాఖ అధికారులకు అప్పగించారు. దీంతో వచ్చే మార్చి వరకు పనులను పూర్తిచేసేందుకు కార్యాచరణను రూపొందించినట్లు అధికారులు చెబుతున్నారు.

చివరి దశలో పనులు..

వేములవాడ ప్రాంత ప్రజల కోసం నిర్మించే మినీస్టేడియం పనులు ఎట్ట కేలకు చివరిదశకు వచ్చాయి. మినీస్టేడియంలో ఇప్పటివరకు డ్రెస్సింగ్ రూములు, కార్యాలయం భవనం, విశ్రాంతి భవనం, క్రీడా సామగ్రి భద్రపరిచే గదులు నిర్మాణ పనులు పూర్తిచేశారు. కిటికీలు, ప్రికాస్ట్ గోడలు, తలుపులతో పాటుగా ఇండోర్ స్టేడియం పైకప్పు పూర్తి చేశారు. ఆర్చీగేటు పనులు కొంతఆలస్యంగా కొనసాగుతున్నాయి. స్టేడియంలోని ట్రాక్‌పై కంకర తేలింది. సెప్టిక్ ట్యాంక్ నిర్మాణంతో పాటు ఇతర పనులు వచ్చే మార్చిలోపు పూర్తి చేస్తామని అధికారులు పేర్కొంటున్నారు.

అపార్ట్‌మెంట్‌లో చోరీ..

● 18 తులాల బంగారం, 111 తులాల వెండి, 1.55 లక్షల నగదు అపహరణ



తలుపునకు బిగించిన గడియను కట్ చేసిన దొంగలు

కరీంనగర్ క్రైం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ప్రగతినగర్‌లోని విజేత మనోహర హెవెన్స్ అపార్ట్‌మెంట్‌లో చోరీ జరిగింది. బాధితులు, పోలీసుల వివరాల ప్రకారం... మంగళవారం రాత్రి 2గంటల సమయంలో ముగ్గురు దొంగలు ముసుగులు, గ్లౌజ్‌లు ధరించి ప్లాట్ల తాళాలు పగులగొట్టి దొంగతనం చేశారు. అపార్ట్‌మెంట్‌లోని కేశెట్టి సందీప్‌కుమార్ దగ్గరి బంధువు మరణించడంతో గతనెల 6వ తేదీన ప్లాట్‌కు తాళంవేసి కుటుంబ సభ్యులతో కలిసి గ్రామానికి వెళ్లాడు. బుధవారం ఉదయం అపార్ట్‌మెంట్ నుంచి ఫోన్ చేయడంతో ఇంటికి వచ్చేసరికి తన ప్లాట్ తాళం పగులగొట్టి ఉంది. బీరువా, పూజగదిలో భద్రపరిచిన 10తులాల బంగారం, 111తులాల వెండి, లక్షా55వేల రూపాయలు నగదు కని పించ లేదు. దీంతో టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇదే అపార్ట్‌మెంట్‌లోని మరోప్లాట్‌లో నివాసం ఉంటున్న మూల కిష్టయ్య శనివారం తాళంవేసి గట్టెపల్లికి వెళ్లాడు. ఆయన భార్య 2నెలల కిందట మరణించింది దొంగలు ప్లాట్ తాళాలు పగులగొట్టి బెడ్‌రూంల్లోని సామగ్రి, దుస్తులను చిందరవందర చేశారు. బీరువాలోని ఎనిమిది తులాల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. ఏడాది కిందట ఈ అపార్ట్‌మెంట్ పక్కన ఉన్న ఇంటితాళాలు పగులగొట్టిన దొంగలు బంగారం, నగదు, ఇతర విలువైన వస్తువులను దోచుకెళ్లారు. ఆ కేసులో ఇప్పటి వరకు నిందితులను పట్టుకోలేదని బాధితుడు రఘునందన్‌రావు వాపోయాడు.

● ఉదయం 2గంటల ప్రాంతంలో అపార్ట్‌మెంట్ వెనుకవైపు నుంచి ప్రహరీ దూకిన ముగ్గురు దొంగలు మొదట వాచ్‌మెన్ ఇంటి తలుపునకు గడియపెట్టారు. అనంతరం అపార్ట్‌మెంట్‌లోని తాళం వేసిన ఫ్లాట్‌ల వద్దకు వెళ్లి ఎదుట, పక్కన ఫ్లాట్‌ల తలుపులకు బయట నుంచి గడియపెట్టారు.

ఆయాఫ్లాట్‌ల తాళాలు పగులగొట్టి లోపలికి చొరబడ్డారు. దాదాపు 3గంటల వరకు ముగ్గురుదొంగలు అపార్ట్‌మెంట్‌లోనే గడిపారు. ఎవరూ బయటకు రాకపోవడంతో వారిపని కానిచ్చారు. వాచ్‌మెన్ కూతురు 3గంటల ప్రాంతంలో బయటకు వచ్చేందుకు ప్రయత్నించగా బయటవైపున గడియపెట్టిన విషయం అర్థమైంది. వెంటనే అపార్ట్‌మెంట్ వారిని వాచ్‌మెన్ అప్రమత్తం చేశాడు. అలికిడి వినడంతో దొంగలు అక్కడినుంచి పరారీ అయ్యారు. దొంగలు కొంతదూరంలో పార్క్ చేసినట్లు గుర్తించారు. సీసీ కెమెరాలలో దొంగతనం మొత్తం రికార్డు అయ్యింది. సంఘటన స్థలాన్ని టూటౌన్ సీఐ సృజన్‌రెడ్డి, ఎస్సై అరుణ్ పరిశీలించారు. క్లూస్‌టీం రెండు ప్లాట్‌లలో ఆధారాలను సేకరించింది. బాధితుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అడవిపందుల బీభత్సం

కోనరావుపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండల కేంద్రంలో అడవిపందులు మంగళవారం రాత్రి బీభత్సాన్ని సృష్టించాయి. కొనుగోలు కేంద్రంలో ధాన్యం మీద కప్పిన కవ ర్లను చించివేశాయి. ధాన్యం కొనుగోలు కేంద్రా ల్లో ప్రతిరోజు రాత్రిపూట ఇదే పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని కాపాడుకోవడానికి వ్యక్తులను నియమించాలని కోరుతున్నారు. అధికారులు కాపలా ఎవరిని పెట్టకపోవడంతో అడవి పందులతో నష్టపోతున్నామని తెలిపారు.

బీరు బాటిళ్లు దాచిన ఘటనపై విచారణ

● ముగ్గురు కానిస్టేబుళ్లపై చర్యలు

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ గ్రామంలో ఈనెల 2న యువకులు తరలిస్తున్న బీరు బాటిళ్లను ఎక్సైజ్ కానిస్టేబుళ్లు స్వాధీనపర్చుకుని 4బీరు బాటిళ్లను దాచుకున్న ఘటనపై ఆ శాఖ సూపరిండెంట్ శ్రీనివాస్‌రావు బుధవారం విచారణచేపట్టారు. కానిస్టేబుళ్ల వ్యవహరించిన తీరుపై ఆరా తీశారు. బీరు బాటిళ్లను దాచుకున్నట్లు నిర్ధారణ కావడంతో కానిస్టేబుళ్లు రాజు, కిశోర్, మల్లేశంను కరీంనగర్ నోడల్ కార్యాలయానికి సరెండర్ చేశారని సీఐ శ్రీనివాస్ పేర్కొన్నారు.

శ్మశాన వాటికలో విద్యుత్తు తీగ చోరీ

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 3 (అంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామశివారు శ్మశానవాటికలో ఉన్న బోరు మోటారు విద్యుత్ తీగను గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం అపహరించుకుపోయారని స్థానికులు తెలిపారు. కరెంటు తీగ విలువ సుమారు రూ.7వేలు ఉంటుందని పేర్కొన్నారు.

రూ.7250 పలికిన పత్తి ధర

జమ్మికుంట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7250 పలికింది. బుధవారం మార్కెట్ యార్డుకు 53మంది రైతులు 338 క్వింటాళ్ల విడిపత్తి విక్రయానికి తీసుకొ చ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర రూ.7250, కనిష్ఠ ధర రూ.6600 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీల్లో తృతీయస్థానం



పతకాలు సాధించిన విద్యార్థులు

పెద్దపల్లి కల్చరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి మహిళా టేబుల్ టెన్నిస్ పోటీల్లో జిల్లా మహిళాజట్టు తృతీయస్థానం సాధించింది. హైదరాబాద్‌లోని మోహినాబాద్ ఫైర్ఫాక్స్ స్పోర్ట్స్, రిసార్ట్‌లో గతనెల 28న జరిగిన 12వ రాష్ట్రస్థాయి ఇంటర్ జిల్లా టేబుల్‌టెన్నిస్ చాంపియన్ పోటీల్లో పెద్దపల్లిజిల్లా మహిళాజట్టు హైదరాబాద్‌తో తలపడగా పెద్దపల్లి జట్టు తృతీయస్థానంలో నిలిచి పతకాలు సాధించింది. విజయం సాధించిన జట్టును జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు కోడం అజయ్, సుల్తానాబాద్ స్పోర్ట్స్‌క్లబ్ అధ్యక్షుడు ముస్త్యాల రవీందర్, ప్రధాన కార్యదర్శి బొల్లి సత్యనారాయణ, అసోసియేషన్ సభ్యులు పల్ల సురేష్, దాసరి రమేష్, ఎస్కే ఇక్బాల్, ప్రణయ్, తిరుపతి అభినందించారు.

రెజ్లింగ్ పోటీల్లో విద్యార్థులకు పతకాలు



బానోతు శృతి



లియాన

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 3 (ఆంధ్ర జ్యోతి): కామారెడ్డి జిల్లాలోని జుక్కల్‌లో ఈ నెల1 నుంచి 3వరకు జరిగిన 69వ రాష్ట్ర స్థాయి పాఠశాలల అండర్-14 రెజ్లింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో కరీంనగర్ సప్తగిరికాలనీ ప్రభుత్వపాఠశాల విద్యార్థినులు సత్తాచాటి పతకాలను కైవసం చేసుకున్నట్లు ఫిజికల్ డైరెక్టర్ అంతటి శంకరయ్య తెలిపారు. 58కేజీలలోపు విభాగంలో బానోతు శృతి అద్వితీయ ప్రతిభకనబరిచి బంగారు పతకం కైవసం చేసుకొని జాతీయస్థాయి పోటీలకు ఎంపికయిందని తెలిపారు. అలాగే 54 కేజీలలోపు విభాగంలో రాణించిన లియాన కాంస్యపతకం సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ముల్కారి రాజేందర్, ఉపాధ్యాయులు అభినందిం చారు.



ఆన్‌లైన్ సేవలకు ప్లాట్‌ఫాం ఉమాంగ్

- కేంద్ర ప్రభుత్వ అధికారిక యాప్‌లో అన్ని సైట్లు
- ఒకే యాప్‌లో 2 వేలకుపైగా వెబ్‌సైట్లు

చొప్పదండి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను, సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఉమాంగ్ యాప్‌ను రూపొందించారు. ఆన్‌లైన్ సేవలకు కేంద్ర ప్రభుత్వం అధికారిక డిజిటల్ గవర్నెన్స్ అప్లికేషన్‌గా ఉమాంగ్(యూనిఫైడ్ మొబైల్ అప్లికేషన్ ఫర్ న్యూ ఏజ్ గవర్నెన్స్)ను రూపొందించింది. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వశాఖ దాదాపు 2 వేలకుపైగా వెబ్‌సైట్లు ఉమాంగ్‌లో అందుబాటులో ఉన్నాయి. 13 ప్రాంతీయ భాషల్లో అందుబాటులో ఉంది. మైస్కీం, డిజిలాకర్‌కు అనుసంధానంగా ఈ యాప్ పనిచేస్తుంది. ప్రభుత్వ సేవలకు వేర్వేరు వెబ్‌సైట్లు, యాప్స్‌కు అవకాశం లేకుండా, కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇంటి నుంచే మొబైల్ ఫోన్‌లో సేవలను పొందవచ్చు.

అందుబాటులో సేవలు

రాష్ట్రానికి సంబంధించిన మీసేవ, రేషన్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ సర్టిఫికెట్, నివాస ధ్రువీకరణ పత్రాలు, మ్యారేజ్ సర్టిఫికెట్‌కు ఉమాంగ్ యాప్‌లో దరఖాస్తు చేసుకోవాలి. పింఛన్లకు సంబంధించిన లైఫ్ సర్టిఫికెట్, విద్యార్థులకు కాలేజీలు, యూనివర్సిటీలు, అప్రూవ్డ్ విద్యాసంస్థల వివరాలు తెలుసుకోవచ్చు. ఏఐసీటీఈ, ఎస్ఎస్‌సీ వెకెన్సీలు తెలుసు కోవచ్చు. యూజీసీకి సంబంధించిన ఈ బుక్స్, సిలబస్, పాత సంవత్సరాల ప్రశ్నాపత్రాలు, రీసెర్చ్ వివరాలు అందు బాటులో ఉంటాయి. పరీక్ష క్యాలెండర్ వివరాలు తెలుసుకోవచ్చు. రేషన్ కార్డులు, ఎల్‌పీజీ గ్యాస్ బుకింగ్, విద్యుత్ బిల్, రైతులకు సంబంధించిన ఈనామ్ మార్కెట్ వివరాలు, పీఎం కిసాన్ యాప్ ద్వారా ఉత్పత్తుల క్రయవిక్రయాలు చేసుకో వచ్చు. ఇవే కాకుండా స్త్రీ శిశు సంక్షేమశాఖ, యూత్ స్కిల్ ఎంపవర్‌మెంట్, వైద్య సర్వీ సులు, పోలీస్, రవాణాతోపాటు అనేక శాఖల సేవలన్నీ ఉమాంగ్‌లో అందుబాటులో ఉన్నాయి.

కేంద్ర ప్రభుత్వ సేవలు

ఆధార్, పాన్, డ్రైవింగ్ లైసెన్స్‌లను డిజిటల్‌గా యాప్‌లో స్టోర్ చేసుకుని షేర్ చేసుకోవచ్చు. ఈపీఎఫ్‌వో సేవలను పొందవచ్చు. ప్రావిడెంట్ ఫండ్ బ్యాలెన్స్ చెక్ చేసుకోవచ్చు. పాస్‌పోర్టు సేవలు, పింఛన్ పత్రాలు, సర్టిఫికెట్‌ను పొందవచ్చు. 2 వేలకు పైగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సేవలన్నీ యాప్ ద్వారా పొందవచ్చు.

యాప్ డౌన్‌లోడ్ ఇలా

మొబైల్‌లోని గూగుల్ ప్లే స్టోర్, ఆండ్రాయిడ్ లేదా యాప్ స్టోర్‌లోకి వెళ్లి ఉమాంగ్ అని సెర్చ్ చేసి డౌన్‌లోడ్ చేసుకోవాలి. యాప్ ఓపెన్ చేసిన తర్వాత భాషను ఎంచుకోవాలి. న్యూ యూసర్/రిజిస్టర్‌ను క్లిక్ చేసి మొబైల్ నెంబర్‌ను ఎంటర్ చేస్తే ఓటీపీ వస్తుంది. ఎంపిన్‌ను సెట్ చేసుకున్న తర్వాత ఆధార్ డేటాను నమోదు చేయాలి. లాగిన్ అయిన తర్వాత డాష్ బోర్డులో ఆల్ సర్వీసెస్ ద్వారా కావాల్సిన సేవను ఎంచుకోవాలి. 80 కేంద్ర ప్రభుత్వ శాఖలకు సంబంధించిన 1,745 ఆన్‌లైన్ సేవలు, వివిధ రాష్ట్రాల సేవలు యాప్‌లో అందుబాటులో ఉన్నాయి.

ముగిసిన బీచ్ వాలీబాల్ పోటీలు



కేశవపట్నంలో జరిగిన పోటీల్లో తలపడుతున్న విద్యార్థులు

శంకరపట్నం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కేశవపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉమ్మడి జిల్లా స్థాయి బీచ్ వాలీబాల్ అండర్-14, అండర్-17 బాలబాలికల ఎంపికపోటీలను బుధవారం నిర్వహించారు. ఉమ్మడిజిల్లాలోని వివిధపాఠశాలల నుంచి సుమారు 150మంది క్రీడాకారులు హాజరయ్యారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు సుభాష్ మాట్లాడుతూ ఎంపికైన క్రీడాకారులు ఈనెల 7నుంచి 9వరకు ఖమ్మంజిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. రాష్ట్ర వ్యాయామ ఉపాధ్యాయసంఘం ఉపాధ్యాయుడు కామురోజు కృష్ణ, హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆఫ్ కరీంనగర్ సెక్రెటరీ శ్రీను, మోడల్ స్కూల్‌పీడీ అధ్యక్షుడు అనూప్‌రెడ్డి, కోశాధికారి వీరపాల్‌రెడ్డి, రాజ్‌కుమార్, సత్యనారాయణ, నిర్మల, సాగర్, మహేష్‌హరీష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన సైనిక్ స్కూల్ విద్యార్థి



ఎస్ సిద్ధు

చొప్పదండి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రుక్మాపూర్ సైనిక్‌స్కూల్ విద్యార్థి జాతీయ స్థాయి రెజ్లింగ్‌పోటీలకు ఎంపికయ్యాడు. ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి అండర్-14 రెజ్లింగ్ పోటీల్లో 8వ తరగతి విద్యార్థి ఎస్.సిద్ధు రాష్ట్రస్థాయిలో బంగారు పతకాన్ని సాధించాడు. ఇదే స్కూల్‌కుచెందిన వరుణ్‌తేజ కాంస్య పతకం గెలుచుకున్నాడు. విద్యార్థులను, కోచ్‌వంశీకృష్ణ, పీఈటీ సుమన్, విక్రమ్‌ను డైరెక్టర్ కర్నల్ రాజాదత్త, ప్రిన్సిపాల్ లింగయ్య, ఎస్‌వీపీ శ్రీనివాస్, ప్రమోద్‌రాజు అభినందించారు.

అంధుల పాఠశాల విద్యార్థితో కలిసి పాట పాడిన కలెక్టర్



విద్యార్థితో కలిసి పాడుతున్న కలెక్టర్

కరీంనగర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి, ప్రతినిధి): కరీంనగర్‌లోని అంధుల పాఠశాల విద్యార్థిని సింధుశ్రీతో కలిసి కరీంనగర్ జిల్లాకలెక్టర్ పమేలా సత్పతి పాట పాడారు. బుధవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని దివ్యాంగులలో స్ఫూర్తి నింపేందుకు పాటను యూట్యూబ్‌లో పోస్ట్ చేశారు. సినీగేయ రచయిత చంద్రబోస్ 2009లోవిడుదల చేసిన నింగినేల నాదే.. అనే సినిమా కోసం రాసిన 'ఆరాటం ముందు ఆటంకం ఎంత' అనే పాటను విద్యార్థినితో కలిపి పాడారు. గతలో సింధుశ్రీ పాటపాడటం చూసిన కలెక్టర్ పాట పాడగా, కరీంనగర్ అంధుల పాఠశాల మ్యూజికల్ టీచర్ సరళ, స్థానిక మ్యూజిక్ డైరెక్టర్ కెబి శర్మ ఆధ్వర్యంలో పాటను రికార్డు చేశారు. గతంలోనూ జిల్లాకలెక్టర్ ఆడపిల్లను రక్షించుకుందాం అంటూ పాడిన ఓ చిన్ని పిచుక పాటకు విశేష ఆదరణ లభించింది.

సడన్ బ్రేక్ వేసిన బస్ డ్రైవర్

- 11మందికి గాయాలు

హుజూరాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్‌లో కారును తప్పించబోయి ఆర్టీసీ బస్సు డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో బుధవారం రాత్రి పెను ప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్-1 డిపోకు చెందిన ఎలక్ట్రిక్ బస్సు వేములవాడకు వెళ్తోంది. ఈ క్రమంలో హుజూరాబాద్ శివారులోని పరకాల క్రాస్‌రోడ్ వద్దకు చేరుకోగానే అకస్మాత్తుగా ఓ కారు బస్సుకు అడ్డుగా వచ్చింది. దీంతో కారును తప్పించబోయి ఆర్టీసీ డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో సీట్లలో ఉన్న ప్రయాణికులు ఒక్కసారిగా ముందు సీట్లకు తగిలి కింద పడిపోయారు. ఈ ఘటనలో 11 మందికి గాయాలు కావడంతో వెంటనే హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ నిర్లక్ష్యం వలనే ప్రమాదం జరిగిందని ప్రయాణికులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

బధిరుల పాఠశాలల్లో ఇంటర్ విద్య

- రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

కరీంనగర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): బధిరుల ఆశ్రమ పాఠశాలల్లో వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఇంటర్ తరగతులు ప్రారంభిస్తామని ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ దివ్యాంగుల వయోవృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. బుధవారం రేకుర్తిలోని బధిరుల ఆశ్రమ పాఠశాలలో మహిళలు, పిల్లలు, వికలాంగులు, వయో వృద్ధులశాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. మహిళా శిశుసంక్షేమశాఖ ప్రిన్సిపల్‌సెక్రెటరీ అనితా రామచంద్రన్, వయోవృద్ధుల దివ్యాంగుల సంక్షేమశాఖ డైరెక్టర్ శైలజతోకలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని, చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించేలా సహాయసహకారాలు అందిస్తామని అన్నారు. దివ్యాంగులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో ఐదుశాతం కేటాయించేలా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేస్తామన్నారు. దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్రప్రభుత్వం 50కోట్లరూపాయలు కేటాయించిందన్నారు. దివ్యాంగులైన ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్రంలోని అన్ని బధిరుల ఆశ్రమ పాఠశాలల్లో సౌకర్యాలు కల్పిస్తామన్నారు. నిపుణులైన అధ్యాపకులను నియమించి సైన్‌లాంగ్వేజ్ ద్వారా తరగతులు బోధిస్తామన్నారు. దివ్యదృష్టిని వృథా చేయవద్దని, ఆసక్తి ఉన్న రంగాల్లో రాణించాలని అన్నారు. ఆర్టీసీ బస్సు పాసుల సమస్య మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. వచ్చే సంవత్సరం దివ్యాంగుల దినోత్సవం నాటికి సమస్యలన్నీ పరిష్కరించనున్నట్లు హామీ ఇచ్చారు. దివ్యాంగుల శిశుసంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ అనిత రామచంద్రన్ మాట్లాడుతూ మన చుట్టూ ఉన్న దివ్యాంగుల్లో ప్రతిభ దాగి ఉంటుందని, వారిని ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారని అన్నారు. సైన్ లాంగ్వేజ్‌లో జనగణ మన పాడిన కలెక్టర్ బృందాన్ని అభినందించారు. స్కిల్ ట్రైనింగ్ ఇచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. యూపీఎస్సీ వంటి ఉన్నతఉద్యోగాల్లో దివ్యాంగులు రాణిస్తున్నట్లు చెప్పారు. వయోవృద్ధుల దివ్యాంగుల సంక్షేమశాఖ డైరెక్టర్ శైలజ మాట్లాడుతూ దివ్యాంగులు ఆత్మస్థైర్యం పెంచుకోవాలని, రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని అన్నారు. జిల్లాలో దివ్యాంగుల సంక్షేమం కోసం కలెక్టర్ చేపడుతున్న కార్యక్రమాలను అభినందించారు. దివ్యాంగుల కో-ఆపరేటివ్ చైర్మన్ వీరయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులతో స్వయం సహాయక సంఘాల ఏర్పాటుకు శ్రీకారంచుట్టిందన్నారు. 40శాతం వైకల్యం ఉన్న దివ్యాంగులకు పరికరాలు అందిస్తున్నట్లు చెప్పారు. సుడాచైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో డీసీబీసీ భవన నిర్మాణానికి కృషి చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కలెక్టర్ పమేలాసత్పతి, జిల్లా సంక్షేమాధికారి సరస్వతి, మెప్మా పీడీ స్వరూపరాణి, అధికారులు,వికలాంగుల సంక్షేమసంఘం ప్రతినిధులు, దివ్యాంగులు పాల్గొన్నారు.



వేడుకలో మాట్లాడుతున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



వేడుకలో నాటకం ప్రదర్శిస్తున్న విద్యార్థులు

బాలుడి కుటుంబానికి అండగా ఉంటాం..

హైదరాబాద్‌లో వీధి కుక్కల దాడిలో గాయపడిన బాలుడి కుటుంబానికి అన్నివిధాల అండగా ఉంటామని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. అతడి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, దివ్యాంగులశాఖ ద్వారా మెరుగైన వైద్యసేవలు అందిస్తామన్నారు. బాలుడి చదువు బాధ్యతలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఘనంగా మల్లికార్జున స్వామి జాతర

- బోనాలు సమర్పించిన భక్తులు



ఆలయం చుట్టూ బోనాలతో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

గొల్లపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి మండలం మల్లన్నపేట మల్లికార్జున స్వామి జాతరకు బుధవారం భారీ సంఖ్యలో భక్తులువచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు బెల్లం పానకంతో వండిన బోనాలను నెత్తిన ఎత్తుకుని ఒగ్గు పూజారుల ఢమరుక నాదాల నడుమ, శివసత్తుల పూనకాల మధ్య ఆలయం వద్దకు ఊరేగింపుగా తరలివచ్చారు. ఈ సందర్భంగా బోనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి మల్లికార్జున స్వామికి బోనాలు సమర్పించారు. అనంతరం క్యూలైన్‌లోగర్భగుడిలోకి తరలివెళ్లి స్వామివారిని దర్శించుకొని పసుపు, బెల్లం, బంతిపూలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు భక్తులు తమ చిన్నారులకు పుట్టువెంట్రుకలు తీయించగా, మరికొందరు భక్తులు నిలువెత్తు బంగారం(బెల్లం) తులాభారంవేసి భక్తులకు పంచిపెట్టారు. ఒగ్గు పూజారుల ఆధ్వర్యంలో మల్లన్న పట్నాలు వేసి ప్రత్యేకమొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు కొండూరి రాజేందర్ శర్మ, కొండూరి రఘునందన్ శర్మ వేదమంత్రోచ్చరణల నడుమ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుమారు 20 వేలమంది భక్తులు స్వామివారిని దర్శించుకోగా, ప్రత్యేక దర్శనానికి విక్రయించిన టికెట్ల ద్వారా ఆలయానికి రూ.79,510 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఫౌండర్‌ట్రస్టీ కొండూరి శాంతయ్య తెలిపారు. ట్రైనీకలెక్టర్ కన్నంహరిణి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐలు రాంనర్సింహారెడ్డి, శ్రీనివాస్, ఎస్సైలు కృష్ణాసాగర్ రెడ్డి, గీతా, టౌన్ ఎస్సై కుమార స్వామి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ ఈవో విక్రమ్, ఆలయ ఫౌండర్ ట్రస్టీ కొండూరి శాంతయ్య పర్యవేక్షించారు.

భీమన్న సన్నిధి వైపు వాహనాలకు బ్రేక్

- రెండు వైపులా రహదారి బంద్



ఉత్తరం వైపు బారికేడ్లతో మూసివేసిన రహదారి

వేములవాడ టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి అనుబంధ ఆలయమైన భీమేశ్వరాలయానికి వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు వెళ్లే భక్తులు ముందుగా వేములవాడకు వచ్చి స్వామి వారిని దర్శించుకొని వెళ్లడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో వేములవాడకు భక్తుల రాక రోజురోజుకు పెరుగుతోంది. దీంతోభక్తుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని భీమేశ్వరాలయం వైపు వాహనాల రాకపోకలను నిలిపివేశారు. కేవలం భక్తులు వెళ్లేవిధంగా ఏర్పాట్లు చేశారు. రహదారిని పూర్తిగా బారికేడ్లు పెట్టి మూసివేశారు. ప్రధానంగా నటరాజ్ విగ్రహం ఉత్తరం వైపు, పార్వతీపురం అన్నదాన సత్రం వైపు బారికేడ్లు పెట్టి రహదారులు మూసివేశారు. దీంతో స్థానికుల వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. మరోవైపు పార్కింగ్ స్థలం వద్ద భారీ గేట్ ఏర్పరిచి కేవలం వీఐపీ వాహనాలను మాత్రమే అనుమతిస్తున్నారు. భీమేశ్వరస్వామి ఆలయానికి భక్తులు చేరుకోవాలంటే వాహనాలు పార్కింగ్‌లో పెట్టి కిలోమీటర్ నడవాల్సిన పరిస్థితి ఉంది. ఈ విధంగా దేవాలయానికి దక్షిణం వైపు విస్తరణ పేరిట ఇరువైపులా రహదారులు మూసివేశారు. దీంతో భక్తుల వాహనాలు, స్థానికుల వాహనాలు ఎటు వెళ్లాలో తెలియని పరిస్థితి ఏర్పడింది. ఇందుకు ప్రత్యామ్నాయంగా వేములవాడ పట్టణంలో పలుచోట్ల దేవాలయాలకు వెళ్లే మార్గాలను సూచించే బోర్డులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

ప్రారంభమైన లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు

తంగళ్లపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో లక్ష్మీనర్సింహస్వామి దేవాలయంలో ద్వితీయ బ్రహ్మోత్సవాలు ప్రారంభ మయ్యాయి. బుధవారం జ్యోతిష్య వాస్తు ఆగమశాస్త్ర పండితులు శ్రీమాన్ నమిలకొండ రమణాచారిస్వామి ఆధ్వర్యంలో ఉదయం నుంచి పూజాకార్యక్రమలు జరిగాయి. సాయంత్రం ఎదురుకోళ్ల ఉత్సవం వైభంగాసాగింది. కార్యక్రమంలో చినజీయర్‌స్వామి శిష్యబృందం శ్రీకాంత్ ఆచార్యులు, రామకృష్ణమాచార్యులు, శశాంక్, వినయ్‌కుమార్ ఆచార్యులు, శ్రీకాంత కౌశిక్, వివేక్ స్వామి తదితరులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న పండితులు

దత్తాత్రేయ స్వామి జయంతి ఉత్సవాలు ప్రారంభం

బోయినపలి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బోయినపల్లి మండలం వరదవెల్లి గ్రామ సమీపంలోని గుట్టపై దత్తాత్రేయ స్వామి జయంతి ఉత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడురోజులపాటు ఉత్సవాలు ఘనంగా జరగనున్నాయి. బుధవారం ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకునేందుకు పర్యాటక శాఖ ఆధ్వర్యంలో మూడు బోట్లను అందుబాటులో ఉంచారు. భక్తులు భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఎస్సై రమాకాంత్, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు.



పూజలు నిర్వహిస్తున్న పండితులు

ఎన్నికలకు భారీ బందోబస్తు

ధర్మపురి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలకు భారీ బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ధర్మపురి సిఐ రాంనర్సింహారెడ్డి అన్నారు. బుధవారం నేరెల్ల గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని ఎస్ఐ మహేష్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని, సోషల్ మీడియాలో ఎవరికి ఇబ్బంది కలిగేలా ప్రజల మనోభావాలు దెబ్బతినేలా పోస్టులు పెట్టరాదనానరు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఉల్లంఘటనలకు పాల్పడిన వారిపై చట్టరిత్యా కేసులు నమోదు చేయబడుతాయన్నారు.

మల్లన్న జాతర

జగిత్యాలరూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలంలోని వంజరిపల్లె గ్రామంలో ఐల్నేని జాతర ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈసంద ర్భంగా జడ్పీ మాజీ చైర్‌పర్సన్ వసంత ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రజిత గంగారాం, బీఆర్ఎస్ నాయకులు రవి, గడ్డం గంగారెడ్డి, దేవి ధర్మయ్య, శ్రీనివాస్, రాజేశం, దశరథం, రాజు, తిరుపతి, లింగారెడ్డి, రజిత తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

వెల్గటూర్, డిసెంబరు 03 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల వివిధ కొత్త మార్గాల్లో సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని ఎప్పటికప్పుడు సైబర్ నేరాల పట్ల అవగాహన పెంచుకొని అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ఉదయ్ కుమార్ పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు బుధవారం వెల్గటూర్ పోలీసు వారి ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిచితమైన వ్యక్తులతో ఫోన్‌లో సంభాషించడం, తెలియని వారికి ఓటీపీ, వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవడం చేయవద్దన్నారు.

మొదట నకిలీ లాభాలు చూపించి తర్వాత పెద్ద మొత్తాల్లో పెట్టుబడులు పెట్టించేవారి పట్ల, లోన్ యాప్ ల పట్ల జాగ్రత్త వహించాలని సూచించారు. డిజిటల్ అరెస్ట్ లాటరీ పట్ల అవగాహన కల్పించారు. అనవస రమైన లింకులను ఓపెన్ చేయవద్దని, తెలియని వారికి డబ్బులు పంపకూడదని పేర్కొన్నారు. విద్యార్థులు గంజాయి, మాదక ద్రవ్యాలకు బానిస కాకుండా క్రమశిక్షణతో ఉండాలని సూచించారు. ఎవరైనా సైబర్ మోసానికి గురి అయితే వెంటనే 1936 నంబరుకు డయల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

కొడిమ్యాల, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన మాజీ ఎంపీటీసీ సురుగు శ్రీనివాస్ తండ్రి సురుగు రాజయ్య మంగళవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందగా మృతుని కుటుంబ సభ్యులను బుధవారం చొప్పదండి మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే వెంట పలువురు మండల, గ్రామ నాయకులు ఉన్నారు.

మూడో విడతకు నామినేషన్ల స్వీకరణ షురూ


బుగ్గారం మండలంలో నామినేషన్లను పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకుడు రమేష్

ధర్మపురి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలో మూడో విడత సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ బుధవారం ప్రారంభమైంది. మండలంలోని ఎనిమిది క్లస్టర్ల పరిధిలో పోటీ చేస్తున్న అభ్యర్థుల నుండి నామినేషన్లు స్వీకరించారు. మొత్తం 25 సర్పంచ్ స్థానాల గాను సాయంత్రం ఐదు గంటల వరకు 31 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. అలాగే మండలంలోని 224 వార్డు సభ్యుల స్థానాలకు గాను 52 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్లు జిల్లా అసిస్టెంట్ ఎన్నికల అధికారి, ఇంచార్జ్ ఎంపీడీవో నరేష్ కుమార్ తెలిపారు.

బుగ్గారం మండలంలో 49 నామినేషన్లు

●**బుగ్గారం:** స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా మంగళవారం బుగ్గారం మండలంలో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు 49 నామినేషన్లు వచ్చాయి. సర్పంచ్ స్థానాలకు 17, వార్డు సభ్యుల స్థానాలకు 32 నామినేషన్లు వేశారు. నామినేషన్ల సందర్భంగా స్టేట్ ఎలక్షన్ అబ్జర్వర్ గాజర్ల రమేష్ తనిఖీ చేసి నామినేషన్ల క్లస్టర్లను పరిశీలించారు. నామినేషన్ ప్రక్రియలో భాగంగా నామినేషన్ పత్రంలో ప్రతి వివరాలు పూర్తి చేయబడి ఉండాలని ఎక్కడ కూడా అసంపూర్తిగా ఉండకూడదని రిటర్నింగ్ అధికారులకు సూచించారు. నామినేషన్ వేసిన పత్రాలను వెంటవెంటనే ఆన్లైన్ నందు అప్లోడ్ చేసే విధంగా చర్య తీసుకోవాలని అధికారులకు సూచించారు .ఈ తనిఖీలో మండల తాసిల్దార్ భుమేశ్వర్, ఎంపీడీవో సుమంత్,పంచాయితీ సెక్రటరీ అక్బర్ పాల్గొన్నారు.

ఎండపల్లి మండలంలో 58 నామినేషన్లు

●**ఎండపల్లి:** పంచాయతీ ఎన్నికల మూడవ విడత ఎండపల్లి మండలంలో నామినేసన్ల ప్రక్రియ బుధవారం మొదలైంది. మండలంలో 15 సర్పంచ్ స్థానాలకు, 138 వార్డు స్థానాలకు ఎన్నిక జరగనుంది. మొదటి రోజు 15 సర్పంచ్ స్థానాలకి 15 మంది, 138 వార్డు స్థానాలకు 43 నామినేషన్లు దాఖలు అయ్యాయి. మండలంలోని పాతగూడూర్, కొత్తపేట, గుళ్ళకోట, ఎండపల్లి క్లస్టర్‌లను జగిత్యాల డీపీవో మధుసుధన్, ఎంపీడీవో దొండ కృపాకర్ సందర్శించి నామినేషన్లను పరిశీలించారు. వెల్గటూర్ ఎస్ఐ ఉదయ్ కుమార్ క్లస్టర్‌ల వద్ద ఏర్పాట్లను పరిశీలించారు.

పెగడపల్లి మండలంలో 111నామినేషన్లు

●**పెగడపల్లి:** పెగడపల్లి మండలంలో మొదటి రోజు సర్పంచ్ పదవికి 39 నామినేషన్లు దాఖలైనట్లు ఎంపీడీవో ప్రేమ్‌సాగర్ రావు తెలిపారు. మూడవ విడుత నామినేషన్ల ప్రక్రియ బుదవారం ప్రారంబం కాగా మండలంలో 23 గ్రామాలకు గాను సర్పంచ్ పదవికి గాను 39 నామినేషన్లు, 216 వార్డు స్థానాలకు గాను 72 నామినేషన్లు దాఖలైనట్లు తెలిపారు. మొదటి రోజు నామినేషన్ల ప్రక్రియను జిల్లా కలెక్టర్ నంచర్ల గ్రామంలో, జిల్లా పంచాయతీ అధికారి రఘువరన్ ఆరవెల్లి గ్రామంలో పరిశీలించి నామినేషన్ స్వీకరణ పకడ్బందీగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

వెల్గటూర్ మండలంలో 46 నామినేషన్లు

●**వెల్గటూర్:** వెల్గటూర్ మండలంలో 19 సర్పంచ్ స్థానాలకు 15 నామినేషన్లు, 168 వార్డులకు గాను 31 నామినేషన్లు దాఖలైనట్లు ఎంపీడీవో వెంకట ప్రసాద్ తెలిపారు. నామినేషన్ల ప్రక్రియను ఎంపీడీవో వెంకట ప్రసాద్, ఎస్సై ఉదయ్ కుమార్ పరిశీలించారు. కాగా మొదటి రోజు స్తంభంపల్లి, పాషిగామ, కుమ్మరిపల్లి, ముత్తునూర్ గ్రామాలలో సర్పంచ్, వార్డు సభ్యులకు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాకపోవడం విశేషం. వెంకటాపూర్, వెల్గటూర్, రాజక్కపల్లి, కిషన్‌రావుపేట, చెగ్యాం, తాళ్ల కొత్తపేట గ్రామాలో సర్పంచ్ స్థానాలకు ఒక్క నామినేషన్ కూడా రాలేదు.

గొల్లపల్లి మండలంలో 104 నామినేషన్లు

గొల్లపల్లి: గొల్లపల్లి మండలంలో 27 సర్పంచ్ స్థానాలకు 35మంది అభ్యర్థులు, 246 వార్డు స్థానాలకు 69మంది అభ్యర్థులు డప్పుచప్పుళ్ల నడుమ తమ మద్దతుదారు నామినేషన్ పత్రాలను దాఖలు పర్చినట్లు ఎంపీడీవో రవీందర్‌రావు తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ రాత్రి వరకు కొనసాగింది.

తొలి విడతలో నలుగురు సర్పంచ్‌లు ఏకగ్రీవం

జగిత్యాల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పంచాయతీ ఎన్నికల్లో భాగంగా తొలివిడతలో నిర్వహించిన నామినేషన్ల స్వీకరణ, నామినేషన్ల ఉప సంహరణ అనంతరం నలువురు సర్పంచ్‌లు ఏకగ్రీవమయ్యారు. జిల్లాలోని ఇబ్రహీంపట్నం మండలం మూలరాంపూర్ సర్పంచ్‌గా కాసుగంటి లాస్య తో పాటు 8 మంది వార్డు సభ్యులు, యామాపూర్ సర్పంచ్‌గా కనుక నగేశ్, కథలాపూర్ మండలం రాజారామ్ తండా సర్పంచ్‌గా భూక్య తిరుపతితో పాటు ముగ్గురు వార్డు సభ్యులు ఏకగ్రీవమయ్యారు. అదేవిధంగా మెట్‌పల్లి మండలం చింతలపేట సర్పంచ్‌గా తొట్ల చిన్నయ్య ఏకగ్రీవమయ్యారు.

బాధితులకు ఆర్థిక సహాయం

మల్యాల, డిశంబరు 3(ఆంధ్రజ్యోతి): ముత్యంపేట ఎన్ఆర్ఐ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొండగట్టు అగ్ని ప్రమాద బాధితులకు రూ.15వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో మర్రి మల్లేశం, సామల సతీశ్, బాలే వంశీకృష్ణ, పంజాల మహేశ్‌గౌడ్, పులి అంజయ్య తదితరులు ఉన్నారు.

తొలి విడత పోరుకు తేలిన అభ్యర్థుల లెక్క

కోరుట్ల రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 15 గ్రామ పంచాయితీల సర్పంచ్ పోటీలలో 57 మంది పోటీలలో ఉన్నట్లు ఎన్నికల అధికారులు బుధవారం తెలిపారు. అయిలపూర్ మేజర్ గ్రామ పంచాయితీ సర్పంచ్ పోటీకి 8 మంది పోటీలో ఉండంగా సర్వరాజుపూర్, కల్లూర్, నాగులపేట గ్రామాలలో సర్పంచ్ పోటీకి ఇద్దరు పోటీ పడుతున్నారు. చిన్నమెట్‌పల్లిలో 5, ధర్మారం 5, గుమ్లాపూర్ 3, జోగినిపల్లి 4, మాదాపూర్ 4, మోహన్‌రావుపేట 3, పైడిమడుగు 6, సంగెం 4, తిమ్మయ్యపల్లి 3, వెంకటాపూర్ 3, యూసుఫ్‌నగర్ 3 సర్పంచ్ పదివి కోరకు పోటీలో ఉన్నారు. 152 మంది వార్డు సభ్యులకు 32 మంది ఎకగ్రీవంకాగా 120 వార్డులకు 293 మంది బరిలో ఉన్నారు. వివిధ గ్రామాలలో సర్పంచ్ పదవి కొరకు నామినేషన్ దాఖలు చేసిన వారిలో 18 మంది విత్ డ్రా కాగా 57 మంది బరిలో ఉన్నారు.

చింతలపేట సర్పంచ్ పదవి ఏకగ్రీవం

●**మెట్‌పల్లి రూరల్:** మండంలో మొదట విడతలో నిర్వహించే సర్పంచ్ కోసం 161, వార్డు మెంబర్లకు 403 నామినేషన్లు అభ్యర్థులు దాఖలు చేశారు. బుధవారం బుధవారం నామినేషన్ల ఉపసంహరణకు గడువు నిర్వహించగా కొందరు డబుల్ నామినేషన్లతో పాటు మరి కొందరు ఉపసంహరణ చేసుకున్నారు. 23 గ్రామాల ఎన్నికల సర్పంచు బరిలో 94, వార్డు మెంబర్లకు 255 మంది ఉన్నట్లు రిటర్నింగ్ అధికారులు ప్రకటించారని ఎంపీడీవో సురేష్ తెలిపారు. మధ్యాహ్నం తర్వాత బరిలో నిలిచిన అభ్యర్థుల జాబితాను రిటర్నింగ్ అధికారులు ప్రకటించారు. అందులో మండలంలోని చింతలపేట గ్రామ సర్పంచ్ పదవికి ఐదుగురు నామినేషన్లను దాఖలు చేయగా బుధవారం నలుగురు ఉపసంహరణ చేసుకున్నారు. బరిలో తొట్ల చిన్నయ్య ఒక్కరే ఉండగా అధికారులు ఏకగ్రీవంగా ప్రకటించారు. మండలంలోని 212 వార్డులకు గాను 101 ఏకగ్రీవం కాగా 255 మంది బరిలో ఉన్నారు.

రెండు సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవం

●**ఇబ్రహీంపట్నం:** మండలంలోని మొత్తం 17 గ్రామపంచాయతీలు ఉండగా, అందులో 17 స్థానాలకు ఇద్దరు ఏకగ్రీవం కాగా, 15 సర్పంచ్ స్థానాలకు 56 పోటీ నిల్చున్నారు. అలాగే వార్డు సభ్యులకు మొత్తం 162 స్థానాల్లో పోటీ చేయగా, 62 ఏకగ్రీవం జరిగాయి. ఈ మేరకు రెండు సర్పంచ్ స్థానాలల్లో యామాపూర్ గ్రామసర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసిన కనుక నాగేష్, మూలరాంపూర్ గ్రామసర్పంచ్‌గా పోటీ చేసిన కాసుగంటి లాస్య రాజశేఖర్‌లు ఏకగ్రీంగా ఎన్నికయ్యారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు పూర్తి కావడ, వీరికి ఎవరూ పోటీ లేకపోవడంతో అధికారులు ఏకగ్రీవంగా ప్రకటించారు. మిగతా స్థానాలకు పోటీ అనివార్యమైంది. ఈ మేరకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.

53 వార్డులు ఏకగ్రీవం

●**మల్లాపూర్:** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా బుధవారం పోటీలో ఉన్న అభ్యర్థులకు గుర్తులను కేటాయించినట్లు ఎంపీడీవో శ్రీకాంత్ తెలిపారు. 23 గ్రామపంచాయతీలు ఉండగా 82 మంది సర్పంచ్ అభ్యర్థులుగా పోటీలో ఉన్నారు. 220 వార్డులకు 53 వార్డులు ఏకగ్రీవం అయ్యాయి. మిగతా 167 వార్డులకు 360 మంది అభ్యర్థులు బరిలో ఉన్నట్లు ఆయన వివరించారు.

సర్పంచ్ స్థానాలకు 48 మంది

●**భీమారం:** స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా 13 గ్రామాల్లో 48 మంది అభ్యర్థులు పోటీ పడనున్నట్లు అధికారులు తెలిపారు. అలాగే 86 వార్డు స్థానాలకు గాను 253 మంది అభ్యర్థులు పోటీ పడనున్నారు. సర్పంచ్ అభ్యర్థులు భీమారంలో నలుగురు, రాజలింగంపేటలో ముగ్గురు, రాగోజీపేటలో ఇద్దరు, దేశాయిపేటలో నలుగురు, గోవిందారంలో ముగ్గురు, రంగాపూర్‌లో నలుగురు, వెంకట్రావుపేటలో ఆరుగురు పోటీ పడుతున్నారు. అలాగే కమ్మరిపేటలో నలుగురు, లింగంపేటలో ముగ్గురు, మన్నెగూడెంలో ఐదుగురు, మోత్కురావుపేటలో ముగ్గురు, ఒడ్యాడ్‌లో ఐదుగురు, పసునూరులో ముగ్గురు బరిలో ఉన్నారు. భీమారం మండల కేంద్రంలో 10 వార్డు వార్డులకు రెండు ఏకగ్రీవం కాగా, దేశాయిపేటలో 10 వార్డులకు 9 ఏకగ్రీవమయ్యాయి. మన్నెగూడెంలో 12 వార్డులకు 8, మోత్కురావుపేటలో 8కి ఒకటి, ఒడ్యాడ్‌లో 8 వార్డులకు 4, పసునూర్‌లో 8కి ఒకటి, రంగాపూర్‌లో 8కి ఏడు వార్డులు ఏకగ్రీవమయ్యాయి.

సర్పంచ్ స్థానం ఏకగ్రీవం

●**కథలాపూర్:** మండలంలో 19 సర్పంచ్ స్థానాలకు ఒక సర్పంచ్ స్థానం ఏకగ్రీవమైంది. రాజారాం తండా సర్పంచ్‌గా భూక్య తిరుపతి ఏకగ్రీవమయ్యాడు. నామినేషన్ల ఉపసంహరణ అనంతరం మండలంలో 83 మంది సర్పంచ్ అభ్యర్థులు బరిలో ఉన్నారు. 188 వార్డు స్థానాలకు గాను 31 ఏకగ్రీవం కాగా 157 స్థానాలకు 418 మంది బరిలో ఉన్నారు.

పటిష్ట నిఘా

(ఐదో పేజీ తరువాయి)

ఇతర వస్తు కొనుగోళ్లపైనా నిఘా పెంచారు. ఇప్పటికే ఆయా దుకాణాల యజమానులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించే వారిపై క్రిమినల్ కేసులు నమోదుతో పాటు జైలుకు పంపేందుకు రంగం సిద్ధం చేస్తోంది.

● **12 విభాగాలకు నోడల్ అధికారులు..**

జిల్లాలో 385 పంచాయతీలు, 3,536 వార్డు స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయి. పోలింగ్, కౌంటింగ్ కోసం పకడ్బందీ చర్యలు చేపడుతుంది. ఇందుకు ఎన్నికల కమిషన్ 12 విభాగాలను ఏర్పాటు చేసింది. వీటికి ఒక్కో నోడల్ అధికారిని నియమించింది. పోలింగ్‌కు ఎంతమంది సిబ్బంది అవసరం, ఎక్కడ విధులు నిర్వర్తించాలి, ఓటింగ్‌లో ఎవరు పాల్గొనాలి, కౌంటింగ్‌లో ఎవరు పాల్గొనాలి, తదితర పనుల పర్యవేక్షణకు మానవవనరుల విభాగాన్ని ఏర్పాటు చేసి నోడల్ అధికారిగా డీఈఓ రాము, ఎల్‌డీఎం రాముకుమార్‌లను నియమించింది. బ్యాలెట్ బాక్సులు ఎన్ని అవసరం, ఎలా సమకూర్చాలి, పోలింగ్ కేంద్రానికి ఎలా తరలించాలి, అటునుంచి స్ట్రాంగ్ రూమ్‌కు ఆ తర్వాత కౌంటింగ్ హాల్‌కు ఎలా తరలించాలి, వంటి పర్యవేక్షణకు బ్యాలెట్ బాక్సుల విభాగాన్ని ఏర్పాటు చేసి నోడల్ అధికారిగా డివిజనల్ పంచాయతీ ఆఫీసర్ సుదర్శన్‌ను నియమించారు. సిబ్బందిని పోలింగ్ బూత్‌లకు తరలింపు అటు నుంచి మళ్లీ వారి గమ్యస్థానాలకు చేర్చేందుకు వాహనాలను పెద్ద సంఖ్యలో సమకూర్చాల్సి ఉంది. ఇందుకు జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్‌ను నోడల్ ఆఫీసర్‌గా నియమించింది. సిబ్బందికి శిక్షణకు డిస్ట్రిక్ట్ యూత్ ఆఫీసర్ రవి కుమార్‌ను, మెటీరీయల్ మేనేజ్‌మెంట్ విభాగానికి జడ్పీ డిప్యూటీ సీఈవో నరేశ్‌ను నోడల్ ఆఫీసర్‌గా, బ్యాలెట్ పేపర్ల నిర్వహణకు జిల్లా సహకార అధికారి మనోజ్ కుమార్‌ను నోడల్ ఆఫీసర్‌గా, హెల్ప్‌లైన్, ఫిర్యాదుల విభాగానికి జిల్లా సంక్షేమ అధికారి బోనగిరి నరేశ్‌ను నోడల్ అధికారిగా, రిపోర్ట్స్ రిటర్న్స్ విభాగానికి అడిషనల్ డీఆర్‌డీవో మదన్‌మోహన్, విమల, శ్రీధర్‌లను నోడల్ ఆఫీసర్‌గా నియమించింది.

● **జిల్లాలో ఏడు పోలీసు చెక్ పోస్టులు..**

జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో ఏడు పోలీసు చెక్ పోస్టులను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా జగిత్యాల-నిజామాబాద్ సరిహద్దు ప్రాంతమైన బండలింగాపూర్ గండి హనుమాన్, జగిత్యాల-నిర్మల్ సరిహద్దు మల్లాపూర్ మండలం ఒబులాపూర్, రాయికల్ మండలం బోర్నపల్లి, జగిత్యాల - సిరిసిల్ల సరిహద్దు కథలాపూర్ మండలం కలికోట, జగిత్యాల- కరీంనగర్ సరిహద్దు కొడిమ్యాల మండలం పూడూరు, జగిత్యాల - మంచిర్యాల సరిహద్దు ధర్మపురి మండలం రాయపట్నం, బీర్‌పూర్ మండలం కమ్మునూర్ ప్రాంతాల్లో పోలీసు చెక్ పోస్టులను ఏర్పాటు చేసిన నిరంతరం తనిఖీలు చేస్తున్నారు.

సర్పంచ్ బరిలో అన్నాచెల్లెళ్లు

కోరుట్ల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల మండలం గుమ్లాపూర్ సర్పంచ్ స్థానానికి మొదటి విడతలో అన్నాచెల్లెళ్ల నామినేషన్లు వేశారు. గుమ్లాపూర్ సర్పంచ్ స్థానం ఎస్సీ జనరల్‌కు రిజర్వ్ కాగా అన్న తెడ్డ శివకుమార్, చెల్లెలు రైట్ల స్రవంతిలు నామినేషన్లు దాఖలు చేశారు. స్రవంతికి అదే గ్రామానికి చెందిన వ్యక్తితో వివాహమైంది. కాగా తొలి విడత నామినేషన్ల ఉపసంహరణ గడువు బుధవారం ముగియగా ఇద్దరూ బరిలోనే ఉన్నారు. దీంతో గ్రామంలో అన్నాచెల్లెళ్ల మధ్య పోటీ నెలకొంది.

కోటిలింగాలలో పర్యటించిన కమిటీ సభ్యులు


కోటిలింగాలలో పరిశీలిస్తున్న అధికారులు

వెల్గటూర్, డిసెంబరు 03 (ఆంధ్రజ్యోతి): రాబోయే గోదావరి పుష్కరాల సందర్భంగా బుధవారం మండలంలోని కోటిలింగాల కోటేశ్వరస్వామి ఆలయాన్ని, గోదావరి పరిసరాలను ప్రభుత్వం నియమించిన కమిటీ సభ్యులు పరిశీలించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కాంతారెడ్డి, ఆలయ చైర్మన్ పూదరి రమేష్, ఆలయ అర్చకుడు సంజీవ్ శర్మ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రెండో విడత నామినేషన్ల పరిశీలన పూర్తి

●బీర్‌పూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ మండలంలో సర్పంచ్‌ల, వార్డు సభ్యుల నామినేషన్ల పరిశీలన బుధవారం పూర్తి అయ్యింది. సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్లను బుధవారం పరిశీలించారు. మండలంలో 85 సర్పంచ్ నామినేషన్లకు నర్సింహులపల్లికి చెందిన ఎడ్ల సృజన నామినేషన్ తిరష్కరణకు గురైంది, సర్పంచ్‌ల అభ్యర్థులు ఒక్కొక్కరు రెండు నామినేషన్ సెట్లు వేసినవాటిలో నుంచి 27 పోగా 57 మంది పోటీలో ఉన్నారు. వార్డు సభ్యులలో 275 నామినేషన్‌లు రాగా 275 నామినేషన్లు వేసిన అభ్యర్థులు పోటీలో ఉన్నట్లు ఎంపీడీవో భీమేష్ తెలిపారు.

●**రాయికల్:** స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా రాయికల్ మండలంలో సర్పంచ్ అభ్యర్థులకు 140 నామినేషన్లు వచ్చినట్లు ఎంపీడీవో చిరంజీవి తెలిపారు. 205 నామినేషన్లకుగాను ఏవీ తిరస్కరించబడలేదని, 65 రెండో సెట్ల నామినేషన్లు ఉండటంతో మొత్తం 140 ఆమోదించబడ్డాయని పేర్కొన్నారు. వార్డు సభ్యుల స్థానాలకు మొత్తం 598కిగాను ఒకటి కూడా తిరస్కరించబడలేదని 30 మంది రెండు సెట్లు వేయడంతో 568 ఆమోదించబడ్డాయని పేర్కొన్నారు.

17 వార్డు స్థానాల్లో సింగిల్ నామినేషన్లు

మల్యాల, డిశంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 19 గ్రామ పంచాయితీ పరిధిలో 186 వార్డు స్థానాలు ఉండగా పలు గ్రామాల్లో గల 17 వార్డు స్థానాల్లో సింగిల్ నామినేషన్లు దాఖలయ్యాయి. నామినేషన్ల స్క్రూటిని అనంతరం అధికారులు ఏకగ్రీవంగా ప్రకటించనున్నారు. దీంతో 169 స్థానాలకు ఎన్నికలు జరుగనుండగా 507మంది నామినేషన్లు దాఖలు చేశారు. 19 గ్రామపంచాయితీల పరిధిలో 101 మంది సర్పంచ్ స్థానాలకు నామినేషన్లు దాఖలు చేశారు. అత్యధికంగా మ్యాడంపల్లిలో 11మంది పోటీలో ఉండగా గొర్రెగుండంలో ఇద్దరు మాత్రమే ఉన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

మెట్‌పల్లి రూరల్, డిసెంబర్ 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బీజేపీ పార్టీకి చెందిన మాజీ ఉపసర్పంచ్ ఆకుల శ్రీనివాస్, బైరా హరీష్ బుధవారం బీఆర్ఎస్‌లో చేరారు కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ సమక్షంలో మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గడ్డం రాజారెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆమడ దూరంలో మున్సిపాలిటీలు

కోరుట్ల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధికి అమడ దూరంలో మున్సిపాలిటీలు ఉన్నాయని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ ఆరోపించారు. బుధవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశంను ఎమ్మెల్యే నిర్వహించారు. అనంతరం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో ఏటా మున్సిపలిటీలకు టీయుఎఫ్ఐడిసి. పట్టణ ప్రగతి నిధులు సక్రమంగా విడుదల చేసి పకడ్బందీగా అభివృద్ధి చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినపటి నుంచి ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేదన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన ఎమ్మెల్యే

మెట్‌పల్లి టౌన్, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): పట్టణంలో నిర్మాణంలోని ప్రభుత్వ ఆసుపత్రి, ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ బుధవారం పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పాలన వచ్చి రెండేళ్లవుతున్న సందర్భంగా సంబరాలు చేసుకుంటున్న ప్రభుత్వం ఇక్కడ ప్రజలు పడుతున్న కష్టాలను మాత్రం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. తాను రెండేళ్లుగా అసెంబ్లీ సమావేశాలు, పలు ప్రెస్‌మీట్లలో ఎన్నిసార్లు కోరుట్ల ప్రాంత ప్రజల ఇబ్బందులు తెలిపినా చెవి కెక్కడం లేదని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వంలో 90 శాతం ప్రభుత్వ ఆసుపత్రి, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, స్కూళ్లు, రోడ్లన్ని పూర్తయినా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎక్కడవేసిన గొంగలి అక్కడే అన్న చందంగా మారిపోయిందన్నారు. ఇప్పటికైనా నియోజకవర్గంలోని ప్రజల ఆరోగ్యం శ్రద్ధ పెట్టాలని డిమాండ్ చేశారు. ఆయనవెంట పలువురు నాయకులు ఉన్నారు.

ప్రజాసామ్యంలో ఓటు రాజ్యాగం కల్పించిన హక్కు


జగ్గసాగర్‌లో అభ్యర్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

మెట్‌పల్లి రూరల్, డిసెంబర్3 (ఆంధ్రజ్యోతి): ప్రజాసామ్యంలో ఓటు హక్కు ప్రతి ఒక్కరికి రాజ్యాంగం కల్పించిందని ఆర్డీవో శ్రీనివాస్, డీఎస్పీ రాములు, ఎంపీడీవో సురేష్‌లు అన్నారు. మండలంలో మొదటి విడతలో ఎన్నికలు జరుగుతున్నందున ఏకగ్రీవం చేయాలని వీడీసీ వేలం పాటలు నిర్వహించడం సరికాదని సర్పంచ్, వార్డు సభ్యుల పదవులకు బరిలో ఉన్న అభ్యర్థులకు బుధవారం గ్రామంలోని రైతు వేదికలో వారు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎవరైనా బెదిరింపులు, ఒత్తిళ్లకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నీత, సీఐ అనిల్, ఎస్సై కిరణ్‌కుమారు, ఆర్ఐ ఉమేష్, కార్యదర్శి ప్రశాంత్ పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన గుడేటికాపు నాయకులు

మండలంలోని జగ్గసాగర్ గ్రామ శివారులోని వరద కాల్వ వెంట ఉన్న ప్రభుత్వ భూమి విషయంలో గ్రామంలోని గుడేటి కాపు కులాన్ని సామాజిక బహిష్కరణ చేసినందును న్యాయం చేయాలని బుధవారం బాధితులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరారు.

బాధిత కుటుంబాలకు స్వశక్తి మహిళల బాసట

మల్యాల, డిశంబరు 3(ఆంధ్రజ్యోతి): కొండగట్టులో నాలుగు రోజుల క్రితం జరిగిన అగ్నిప్రమాదంలో నష్టపోయిన బాదిత కుటుంబాలకు స్వశక్తి మహిళలు బాసటగా నిలిచారు. జగిత్యాల జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలో రూ.1.50లక్షలను ప్రమాద బాధిత 30 కుటుంబాలకు రూ.5వేల చొప్పున అందించారు. ఈ సందర్భంగా అడిషనల్ డీఆర్డీవో సునీత అయిదు స్టవులను అందించారు. కార్యక్రమంలో జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సరోజన, ప్రాజెక్ట్ మేనేజర్లు రమేశ్, నారాయణ ఏపీఎం గంగాధర్, మండల సమాఖ్య అధ్యక్షురాలు ఆమని, కార్యదర్శి అన్విత, సీసీలు, వీఏవోలు పాల్గొన్నారు.

● **బియ్యం అందజేత**

ముత్యంపేట సరస్వతి గ్రామైఖ్య సంఘం ఆధ్వర్యంలో బాదిత కుటుంబాలకు ఐదు క్వింటాళ్ల బియ్యంతో పాటు రూ.20వేల విలువైన సరుకులు అందజేశారు. గ్రామ సంఘాల అధ్యక్షులు, వీవోఏ పొనగంటి సుధ, ఆకుల సుమలత, గాజుల సుధ, బొట్ల లక్షిత, రజిత పాల్గొన్నారు.

దివ్యాంగులకు అండగా చట్టాలు


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి నాగేశ్వర్‌రావు

మెట్‌పల్లి టౌన్, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు అండగా ఎన్నో చట్టాలు ఉన్నాయని సీనియర్ సివిల్ జడ్జి నాగేశ్వర్‌రావు అన్నారు. బుధవారం అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా మండల లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఇందులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు ప్రభుత్వ పరంగా అనేక సంక్షేమ పథకాలు, న్యాయపరంగా అనేక చట్టాలు అండగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో బార్అసోసియేషన్ అధ్యక్షుడు కంతి మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పనుసూరి శ్రీనివాస్, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చెర్లపల్లి ఆనంద్, అసిస్టెంట్ గవర్నమెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ హఫీజ్ పాల్గొన్నారు.

●**జగిత్యాల అగ్రికల్చర్:** జిల్లా కేంద్రంలోని స్థానిక సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో బుధవారం అంతర్జాతీయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో రాణించిన దివ్యాంగులను సంఘ పక్షాన ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ మాట్లాడుతూ వైకల్యం జీవితానికి అడ్డుకాకూడదని, పట్టుదలతో శ్రమించి ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ బాధ్యులు విశ్వనాథం, ప్రకాష్‌రావు, హన్మంతరెడ్డి, అశోక్‌రావు, యాకూబ్, గంగాధర్, శివానందం, రాజేశ్వర్, బుచ్చిరెడ్డి, కరుణ, రాధ తదితరులున్నారు.

●**కోరుట్ల :** పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంతో పాటు వివిధ కార్యాలయాలలో ప్రపంచ వికలాంగుల దినోత్స వేడుకలను నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమీషనర్ రవీంధర్ వికలాంగుల సంఘ నాయకులతో కలిసి నిర్వహించారు.

●**రాయికల్:** దివ్యాంగులను వారికి ఇష్టమైన రంగంలో రాణించేలా ప్రోత్సహించాలని రాయికల్ ఎంఈవో ఎస్.రాఘవులు అన్నారు. రాయికల్ పట్టణంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో బుధవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు.

●**కథలాపూర్:** మండల కేంద్రంలో బుధవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా వారికి ఆటల పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఎంఈఓ లోకిని శ్రీనివాస్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఐఈఆర్‌పీ సాబిదా, సీఆర్‌పీలు, ఉపాధ్యాయులు ఉన్నారు.

డీసీసీ అధ్యక్షుడికి సన్మానం

మెట్‌పల్లి టౌన్, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాజెంగి నదయ్యను బుధవారం మెట్‌పల్లి పట్టణంలోని టీపీసీసీ డెలిగేట్ సుజిత్ రావు నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన నందయ్యను ఘనంగా శాలువాతో సత్కరించారు. ఆయనవెంట మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కూన గోవర్దన్, తెలంగా కిసాన్ కాంగ్రెస్ సెల్ జాయింట్ కోఆర్డినేటర్ వాకిటి సత్యం రెడ్డి, టీపీసీసీ ఫిషర్‌మెన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రుత్త నారాయణ, కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందే మారుతి, మెట్‌పల్లి పట్టణ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు పాషా, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం దిష్టిబొమ్మ దహనం

ధర్మపురి: హిందు దేవతలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మను ధర్మపురి కేంద్రంలో బీజేపీ నాయకులు దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు గాజు భాస్కర్ మాట్లాడుతూ తెలంగాణలో హిందు దేవి దేవతలపై దేవాలయాలపై హిందు సమాజంపై అనుచిత వ్యాఖ్యలు చేయడం ఫ్యాషన్‌గా మారిపోయిందన్నారు. కార్యక్రమంలో పిల్లిశ్రీనివాస్, బెజ్జారపు లవన్, బండారి లక్ష్మణ్, ఆకుల శ్రీనివాస్, పోగుల గుండన్న, స్తంభంకాడి శ్యామ్, నారవేణి మూర్తి, వేలుగుమట్ల రవి, తిరుమందాస్, సత్యనారాయణ, కామెర ప్రభాకర్, జెల్ల వినోద్ పాల్గొన్నారు.

రాయికల్: రాయికల్ మండల కేంద్రంలో బుధవారం సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను బీజేపీ నాయకులు దహనం చేశారు. రాయికల్ పట్టణంలోని గాంధీ విగ్రహం వద్ద దహనం చేశారు. రేవంత్ రెడ్డి తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు దిష్టిబొమ్మ దహనాన్ని అడ్డుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ, మండల అధ్యక్షులు కురుమ మల్లారెడ్డి, ఆకుల మహేష్, నాయకులు కునారపు భూమేష్, సామల్ల సతీష్, గాజెంగి అశోక్, వట్టిమల్ల శ్రీనివాస్, మర్యాద సత్యం, బోయిని నరేందర్, గంగాధర్, సుమన్ పాల్గొన్నారు.